# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 11 మే 2026 | సంపుటి: 22 | సంచిక: 222 | వెల: రూ.7 | పేజీలు: 12+8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## 36 గంటలైనా బండి కుమారుడిపై చర్యలేవి?

### రేవంత్‌ను నిలదీసిన హరీశ్‌రావు




**హైదరాబాద్, మే 10 (నినాదం)**

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదు చేయడంలో పోలీసుల జాప్యంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. కేసు నమోదు చేయడానికి 8 గంటల సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు.

## యుద్ధాన్ని ముగిస్తాం

### ఉక్రెయిన్‌తో కీలక దశకు చర్చలు: రష్యా అధ్యక్షుడు పుతిన్



**న్యూఢిల్లీ (నినాదం)**

నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ప్రకటించారు. శనివారం రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు యురోపియన్ యూనియన్‌తో కూడా చర్చలు జరుపుతానని పుతిన్ ...మిగతా 2లో

## దేవాన్ష్‌కు మోడీ అభినందనలు

- హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి ప్రధాని మోదీ
- గంటకు పైగా సీఎం నివాసంలో గడిపిన ప్రధాని
- ఇది తమ కుటుంబానికి చిరస్మరణీయ సాయంత్రమన్న చంద్రబాబు
- ప్రధాని ఆప్యాయత మరువలేనిది: చంద్రబాబు





## పవన్‌కు మోడీ పరామర్శ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. **- హైదరాబాద్, మే 10 (నినాదం)**


## 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' వేగంతో..

# దూసుకెళ్తోన్న భారత్

### తెలంగాణలో రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోడీ

### జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన

### ఈ ప్రాజెక్టులతో కనెక్టివిటీ మెరుగుపడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి: మోడీ




**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా తెలంగాణలో సుమారు రూ. 9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు.**

**- హైదరాబాద్, మే 10 (నినాదం)**

హైదరాబాద్–పనాజీ ఎకనామిక్ కారిడార్: ఇందులో భాగంగా సూరారం నుంచి మహబూబ్ నగర్ వరకు రూ. 3,180 కోట్లతో 84 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు.

కాజీపేట–విజయవాడ మల్టీ–ట్రాకింగ్: ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 1,200 కోట్లతో నిర్మించిన 118 కిలోమీటర్ల రైల్వే లైన్లను జాతికి అంకితం చేశారు.

కాజీపేట రైల్ అండర్ బైపాస్: కాజీపేట జంక్షన్‌లో రైళ్ల రాకపోకలను సులభతరం చేసేందుకు రూ. 2,300 కోట్లతో నిర్మించిన 21 కిలోమీటర్ల బైపాస్‌ను ప్రారంభించారు.

గ్రీన్‌ఫీల్డ్ పీఓఎల్ టెర్మినల్: మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) టెర్మినల్‌ను ప్రారంభించారు.

పీఎం మిత్ర పార్క్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ...మిగతా 2లో



## పెద్ద మనసుతో సహకరించండి

### ప్రధాని మోడీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

### దేశాభివృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యంపై సీఎం కీలక వ్యాఖ్యలు

**"ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు. అభివృద్ధి గురించే మాట్లాడదాం. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర మంత్రులను నేను తరచూ కలుస్తుంటాను. కొన్ని పనులు అయ్యాయి. ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయి. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలి. తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి"**

**- రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం**

**హైదరాబాద్, మే 10 (నినాదం):**

ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఇది అభివృద్ధి ఉత్సవమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్లేందుకు అవసరమైన అభివృద్ధి ఉత్సవమని, ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని, ఇప్పుడు ...మిగతా 2లో

## టార్గెట్ తెలంగాణ

### మార్పు కోరుకుంటున్న తెలంగాణ ప్రజలు

**పక్కా అధికారంలోకి వస్తాం..**

**ప్రధాని నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మే 10 (నినాదం):**

బెంగాల్ విజయోత్సాహం.. తెలంగాణలోనూ స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఇవాళ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. 'నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా.. మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన చారిత్రక విజయం గురించి ప్రధాని మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'తాను నిన్న బెంగాల్‌లోనే ఉన్నాను. అక్కడ మన పార్టీ అఖండ ప్రచండ విజయం సాధించింది. బీజేపీకి చెందిన నేత తొలిసారి ముఖ్యమంత్రిగా ...మిగతా 2లో

## తిరుమలలో భారీ రద్దీ

### శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం

- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండిపోయిన వైనం
- శనివారం శ్రీవారిని దర్శించుకున్న 81,512 మంది భక్తులు
- హుండీ ద్వారా రూ. 3.23 కోట్ల ఆదాయం

## అసోం సీఎంగా హిమంత

### మే 12న ప్రమాణ స్వీకారం

**మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న ఎన్‌డీఏ కూటమి**



అసోం ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన హిమంతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తున్నట్లు ఆదివారం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మార్గం సుగమమైంది. మే 12వ తేదీ ఉదయం 11:40 గంటలకు ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో హిమంత ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చీఫ్ సెక్రటరీ పేర్కొన్నారు.

**- న్యూఢిల్లీ, మే 10 (నినాదం)**

## మనీలాండరింగ్ కేసులో సంచలనం..

# మంత్రికి 7 రోజుల ఈడీ కస్టడీ



పంజాబ్ పాలిటిక్స్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రూ.100 కోట్ల మనీలాండరింగ్, జీఎస్టీ మోసం ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గుర్గావ్‌లోని ప్రత్యేక కోర్టు ఆదివారం ఆయనకు 7 రోజుల ఈడీ కస్టడీని విధిస్తూ తీర్పునిచ్చింది.

**- న్యూఢిల్లీ, మే 10 (నినాదం)**



## సింగపూర్ పర్యటనకు మంత్రి లోకేష్

### జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశం

- ప్రముఖ సంస్థల సీఈవో, సీఎఫ్‌ఓలతో భేటీ
- డీపీ ఆర్కిటెక్ట్స్ ప్రతినిధులతోనూ...

**అమరావతి (నినాదం)**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సోమవారం (మే 11) నాడు ఆయన సింగపూర్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలే ...మిగతా 2లో

## తమిళనాడు సీఎంగా

# విజయ్ ప్రమాణం

### వచ్చీ రావడంతోనే గత ప్రభుత్వంపై విమర్శల దాడి

- రూ.10 లక్షల కోట్ల అప్పు చేసి ఖజానాను ఖాళీ చేసిందని తీవ్ర ఆరోపణ
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తానని సంచలన ప్రకటన
- తప్పు చేస్తే తన సొంత ప్రభుత్వంలోని వారినైనా వదిలిపెట్టనని తీవ్ర హెచ్చరిక
- మహిళల భద్రత, డ్రగ్స్ నిర్మూలన, శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యత అని స్పష్టీకరణ



తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

**– చెన్నై (నినాదం)**



## ఖజానా ఖాళీ అని సాకులు చెప్పొద్దు

### విజయ్‌కు స్టాలిన్ చురకలు!

- తమిళనాడు నూతన సీఎం విజయ్‌కు మాజీ సీఎం స్టాలిన్ అభినందనలు
- రూ.10 లక్షల కోట్ల అప్పు ఆరోపణలను ఖండించిన స్టాలిన్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే విజయ్ హామీలు ఇచ్చారని విమర్శ

## నీలిరంగు పట్టుచీరలో ప్రత్యేక ఆకర్షణగా త్రిష



# తిరుమలలో భారీ రద్దీ

తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ అధికంగా కొనసాగుతోంది. ఆదివారం కావడంతో శ్రీవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు చేరుకున్నారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. భక్తుల క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపల కృష్ణతేజ అతిథి గృహం వరకు విస్తరించాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ సమయం వర్తిస్తుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా, దర్శనానికి వచ్చే వారు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇక శనివారం (మే 9) ఒక్కరోజే 81,512 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 38,988 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ. 3.23 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది.

## పెద్ద మనసుతో సహకరించండి

మొదటి పేజీ తరువాయి

రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని రేవంత్ పేర్కొన్నారు. అభివృద్ధి గురించే మాట్లాడదామని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తు చేసిన ఆయన, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని తెలంగాణ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర మంత్రులను తాను తరచూ కలుస్తుంటానని అన్నారు. కొన్ని పనులు అయ్యాయని, ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయని మోదీ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలని, తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలని కోరారు. దేశానికి 10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నామని, మోదీకి విశాల హృదయం ఉందని కిషన్‌రెడ్డి చెబుతుంటారని, మోజీ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు సహకరిస్తే వేగంగా అభివృద్ధి చెందుతామని అన్నారు.

నగరాలను కేంద్రం ప్రోత్సహించాలి : దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందన్న సీఎం, దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశ జీడీపీకి 10 శాతం వాటా ఇవ్వాలనే లక్ష్యంతో సాగుతున్నామని, దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని ప్రధానిని కోరారు.

మోదీ సహకరించాలి : రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, తెలంగాణ ప్రాజెక్టులపై 2 గంటలు కేటాయించి సమీక్షించాలని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ – మచిలీపట్నం వరకూ 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేకు సహకరించాలని కోరారు.

## సింగపూర్ పర్యటనకు మంత్రి లోకేష్

లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఎంటీఐ కార్యాలయంలో జరిగే జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో లోకేష్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం సింగపూర్‌లోని సన్ టెక్ సిటీలో వరుస భేటీలు జరపనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు కమోడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో, సీఎఫ్ఓలతో సమావేశమవుతారు. ఆ తర్వాత 2:30 నుంచి 3 గంటల వరకు డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధులతో లోకేష్ భేటీ అవుతారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

## మనీలాండరింగ్ కేసులో సంచలనం.. మంత్రికి 7 రోజుల ఈడీ కస్టడీ

మంత్రి సంజీవ్ అరోరా, ఆయనకు సంబంధించిన 'హాంప్టన్ స్కై రియాల్టీ లిమిటెడ్' సంస్థపై ఈడీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. మొబైల్ ఫోన్ల కొనుగోలుకు సంబంధించి దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువైన తప్పుడు జీఎస్టీ ఫేక్ బిల్లులను సృష్టించి, తద్వారా భారీగా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులను దుబాయ్‌కి పంపి, తిరిగి పెట్టుబడుల రూపంలో భారత్‌కు రప్పించే ప్రక్రియలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ పేర్కొంది. గతంలో లూథియానాలోని పారిశ్రామిక భూముల కేటాయింపులో కూడా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. శనివారం సాయంత్రం చండీగఢ్‌లోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు, సుదీర్ఘ విచారణ అనంతరం అరోరాను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టగా ఈ మొత్తం స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను కనిపెట్టేందుకు కస్టడీ అవసరమని ఈడీ వాదించింది. 10 రోజుల కస్టడీ కోరగా.. కోర్టు మాత్రం 7 రోజులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చింది.

## యుద్ధాన్ని ముగిస్తాం

మొదటి పేజీ తరువాయి

వెల్లడించాడు. ఈయూ అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఈయూ)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్సలర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఈయూతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, యుక్రెయన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లైనా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

## దేవాన్ష్‌కు మోడీ అభినందనలు

**హైదరాబాద్, మే 10 (నినాదం):**

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని.. జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధానికి చంద్రబాబుతో పాటు మంత్రి లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. గంటకు పైగా మోదీ అక్కడ ఉన్నారు. వివిధ అంశాలపై చంద్రబాబుతో ఆయన సమాలోచనలు జరిపారు. సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. చెస్ క్రీడలో దేవాన్ష్ ప్రతిభ చూపడంపై ప్రధాని మోడీ అభినందించడంతో మరిన్ని అవార్డులు గెలుచుకుని దేశానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లిన ఫొటోలను ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యుల్ని కలిసినట్లు తెలిపారు. వారందరినీ కలవడం, ఎన్నో విభిన్నమైన అంశాలపై అభిప్రాయాల్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

# 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' వేగంతో దూసుకెళ్తోన్న భారత్

రూ. 1,700 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీఎం మిత్ర పార్కుకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. "నేటి భారత్ 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' మీద నడుస్తోంది. అదే సమయంలో ఆధునిక మౌలిక సదుపాయాలను కూడా వేగంగా నిర్మిస్తోంది. ఈ రోజు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయి, తెలంగాణ కనెక్టివిటీని మరింత బలోపేతం చేస్తాయి" అని మోదీ అన్నారు.

"ఒకప్పుడు ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పుడు, మన టెక్స్‌టైల్ పరిశ్రమ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు వరంగల్‌లోని పీఎం మిత్ర పార్క్ దేశంలో టెక్స్‌టైల్ విప్లవాన్ని వేగవంతం చేస్తుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు.

"గత 12 ఏళ్లుగా ఆధునిక కనెక్టివిటీకి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రోడ్లు, రైల్వేలు, విమానాశ్ర



యాలు... ఇలా ప్రతి రవాణా మార్గంపై అపూర్వమైన పెట్టుబడులు పెడుతున్నాం. గత 11 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయింది. కేవలం జాతీయ రహదారుల కోసమే సుమారు రూ. 1.75 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాం" అని వివరించారు. రైల్వే బడ్జెట్‌పై మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉండేది. కానీ నేడు ఒక్క తెలంగాణకే ఈ ఏడాది రూ. 5,500 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి" అని తెలిపారు. ప్రపంచంలో ఇంధన భద్రత ప్రాముఖ్యత పెరిగిందని, అందుకే తమ ప్రభుత్వం దీనిపై భారీగా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. సౌరశక్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. "ఈ మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఇది తెలంగాణ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. తెలంగాణలోని ప్రతి కుటుంబ సభ్యుని కలలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం మరింత వేగంతో పని చేస్తుందని హామీ ఇస్తున్నాను" అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

# తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణం

అనంతరం ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలోనే ఆయన గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రం సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఉందని, ఖజానాను పూర్తిగా తుడిచిపెట్టేశారని సంచలన ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని, అవినీతిని ఏమాత్రం సహించబోనని, తప్పు చేస్తే తన వారిని కూడా ఉపేక్షించనని గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

**నేనూ మీలో ఒకడినే..**

ఈ సందర్భంగా విజయ్ భావోద్వేగంగా ప్రసంగించారు. "సినిమాల్లో ఎలాగైనా నిలదొక్కుకోవాలని కష్టపడిన ఒక సాధారణ అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకుగా, నాకు పేదరికం, ఆకలి విలువ బాగా తెలుసు. నేనేమీ రాజుల కుటుంబం నుంచి రాలేదు. మీలో ఒకడిగా, మీ కుటుంబ సభ్యుడిగా, మీ బిడ్డగా, మీ అన్నగా, తమ్ముడిగా నన్ను నేను భావిస్తున్నాను. మీరు కూడా నన్ను అలాగే ఆదరించినందుకే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను" అని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తనను ఎన్నో అవమానాలు, కష్టాలు చుట్టుముట్టినా ప్రజలు అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకోవడానికే వచ్చానని స్పష్టం చేశారు.

**ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం..**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, "గత ప్రభుత్వం రాష్ట్రంపై మోయలేని అప్పుల భారాన్ని మోపి, ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనం బాధ్యతలు స్వీకరించాం. ఇది నిందలు వేయడం కాదు, వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలి. అందుకే, రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలియజేసేందుకు ఒక శ్వేతపత్రం విడుదల చేస్తాను. మాది పారదర్శకమైన ప్రభుత్వం. ఏదీ దాపరికాలు లేకుండా, ముసుగులు వేసుకోకుండా బహిరంగంగానే వ్యవహరిస్తాను" అని విజయ్ ప్రకటించారు.

**అవినీతిని సహించను.. ఒకే పవర్ సెంటర్**

అవినీతిపై తన వైఖరిని స్పష్టం చేస్తూ, "ప్రజాధనం నుంచి ఒక్క పైసా కూడా నేను ముట్టుకోను. ఆ అవసరం నాకు లేదు, అది మీకు బాగా తెలుసు. ఈ విజయ్ తప్పు చేయడు, ఇతరులను చేయనివ్వడు. నా ప్రభుత్వంలో ఉన్నవారైనా సరే, తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు. గెలిచాం కదా అని ఆటలు ఆడదామనే ఆలోచన ఎవరికైనా ఉంటే, ఇప్పుడే దాన్ని తుడిచిపెట్టేయండి. ఇక్కడ ఒకే ఒక్క పవర్ సెంటర్ ఉంటుంది, అది నా నాయకత్వంలోనే ఉంటుంది. వేర్వేరు అధికార



కేంద్రాలకు తావు లేదు" అని గట్టిగా హెచ్చరించారు.

**ప్రాధాన్యతలు, హామీలు**

తన ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ, "మహిళల భద్రతకు కఠిన చర్యలు తీసుకుంటాం. యువతను నాశనం చేస్తున్న డ్రగ్స్ సంస్కృతిని అణిచివేసేందుకు ఇప్పటి నుంచే చర్యలు మొదలుపెడతాను. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, విద్య, రేషన్, వైద్యం, తాగునీరు, రోడ్లు, బస్సు సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలపైనే నా పూర్తి దృష్టి ఉంటుంది," అని హామీ ఇచ్చారు. "నన్ను అవమానించిన వారు కూడా నా ప్రజలే. స్నేహితులైనా, శత్రువులైనా రాష్ట్రంలోని ఎనిమిది కోట్ల మంది ప్రజలు నా వాళ్లే" అని పేర్కొన్నారు.

**అందరినీ కలుపుకుపోతాం**

మత సామరస్యంపై మాట్లాడుతూ, "పుట్టుకతో జీవులందరూ సమానమే అనేదే మా సిద్ధాంతం. మైనారిటీ సోదరులకు మా ప్రభుత్వం అండగా ఉంటుంది. హిందూ, ముస్లిం, క్రైస్తవులందరి ముఖం ఈ విజయ్ ముఖం. ఈ విషయంలో నన్ను 100 శాతం నమ్మవచ్చు" అని భరోసా ఇచ్చారు. తన గెలుపునకు కారణమైన చిన్నారులకు, పార్టీ కార్యకర్తలకు, వర్చువల్ వారియర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తన ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సీపీఎం నేతలు ఎంఏ బేబీ, కే. బాలకృష్ణన్, వీసీకే నేత తిరుమావళవన్, సీపీఐ నేత డి. రాజా సహా ఇతర మిత్రపక్షాల నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. "ఇది ఒక కొత్త ఆరంభం. నిజమైన లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన పాలన ఇక్కడి నుంచే మొదలవుతుంది" అని విజయ్ తన ప్రసంగాన్ని ముగించారు.<

**9 మంది మంత్రులుగా ప్రమాణం**

ఇదిలా ఉండగా, తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ విజయ్‌తో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించారు. విజయ్‌తో పాటు 9మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్. ఆనంద్, అదవ్ అర్జున, కె.జి. అరున్‌రాజ్, కె.ఎ. సెంగొట్టియాన్, పి. వెంకట రమణన్, ఆర్. నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, డాక్టర్ టీకే ప్రభు, సెల్వి ఎస్. కీర్తన మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరు**

విజయ్ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిల్లీ నుంచి చెన్నై వచ్చారు. టీవీకే నేతలు, విజయ్‌కు మద్దతిస్తున్న పార్టీల నాయకులు నెహ్రూ ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. రాజకీయ నాయకులతో పాటు సినీ ప్రముఖులు సైతం విజయ్ ప్రమాణ స్వీకారం కోసం వచ్చారు. ప్రముఖుల రాక నేపథ్యంలో వేదికకు దారితీసే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. స్టేడియం చుట్టుపక్కల భారీగా బలగాలను మోహరించారు.

**సచివాలయానికి వెళ్లి బాధ్యతలు**

ప్రమాణ స్వీకారం అనంతరం సచివాలయానికి వెళ్లిన విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నూతన సీఎంకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు కేబినెట్‌లో ప్రస్తుతం మిత్రపక్షాలకు నేతలకు చోటు దక్కలేదు. మిత్రపక్షాలను సంప్రదించి తర్వాత కేబినెట్ విస్తరణ చేయనున్నట్లు సమాచారం. విజయ్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్, ఇతర కుటుంబ సభ్యులు, టీవీకే నాయకులు, మద్దతు ఇచ్చిన పార్టీ నాయకులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. కార్యకర్తలు, సినీ ప్రముఖులు సైతం విజయ్ ప్రమాణ స్వీకారానికి వచ్చారు.

**మోదీ, ఖర్గే విషెస్**

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు. మరోవైపు విజయ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజకీయ, సామాజిక చైతన్యాన్ని దీర్ఘకాలంగా నిర్వచిస్తూ వస్తున్న ఆదర్శాలు, పాలనను ముందుకు నడిపిస్తాయని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఖజానా ఖాళీ అని సాకులు చెప్పొద్దు

### విజయ్‌కు స్టాలిన్ చురకలు!

**చెన్నై (నినాదం)**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. అయితే, వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం.

'గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయింది' అని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా? ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది? మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి.

'ఆచరణ సాధ్యమైన వాటినే హామీలుగా ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనలోకి అడుగుపెడుతున్నారు. త్వరలోనే, మాలాగా మీరు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలనే మెలకువలను నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను. ఓటు వేసిన ప్రజలతో పాటు, నేను కూడా అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రయాణం కొనసాగాలని మరోసారి ఆకాంక్షిస్తూ, నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# నీలిరంగు పట్టుచీరలో ప్రత్యేక ఆకర్షణగా త్రిష

**చెన్నై (నినాదం)**

తమిళనాడు ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ, ప్రముఖ నటి త్రిష కృష్ణన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నీలిరంగు కంచి పట్టుచీర, జడలో మల్లెపూలు, వజ్రాలు, కెంపుల నెక్లెస్‌తో సాంప్రదాయబద్ధంగా ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని కార్యక్రమానికి ముందు త్రిష పేర్కొన్నారు. ఆమె వెంట తల్లి ఉమా కృష్ణన్ కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న ద్రవిడ దిగ్గజాలైన డీఎంకే, అన్నాడీఎంకేలను ఓడించి విజయ్ చరిత్రాత్మక విజయం సాధించారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి త్రిష తన మిత్రుడు విజయ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఫలితాల రోజు (మే 4న) తన పుట్టినరోజున తిరుపతిలో ప్రత్యేక పూజలు చేశారు. విజయ్ పార్టీ ఆధిక్యం ఖరారయ్యాక చెన్నైలోని ఆయన నివాసానికి కూడా వెళ్లారు. అంతకుముందు, పోలింగ్ రోజున 'గిల్లి' సినిమా నేపథ్య సంగీతంతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి పరోక్షంగా తన మద్దతు తెలిపారు. మరోవైపు, విజయ్ భార్య సంగీత విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత, విజయ్–త్రిష సంబంధంపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వార్తలపై ఇద్దరూ మౌనం పాటిస్తున్నప్పటికీ, పలు సందర్భాల్లో కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.





## పవన్‌కు మోడీ పరామర్శ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను కలుసుకున్న ప్రధాని మోదీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం, ప్రధాని మోదీ జూబ్లీహిల్స్ లోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు.

## 36 గంటలైనా బండి కుమారుడిపై చర్యలేవి?

బండి సంజయ్ కుమారుడిపై కేసు నమోదై.. 36 గంటలు గడుస్తున్నా నిందితులపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందానికి, కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం వేరే ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. పోలీసులు వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలని బీఆర్ఎస్‌వీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం ముందు ఆదివారం మెరుపు ధర్నా చేశారు. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపైనా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మరోవైపు పేట్‌బషీర ◌ాబాద్ పోలీస్ స్టేషన్‌ను పలువురు మహిళలు ముట్టడించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



## టార్గెట్ తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

ప్రమాణ స్వీకారం చేయడం మనందరికీ గర్వకారణం' అని గుర్తు చేశారు. బెంగాల్ విజయం తాలూకు ఆ విజయోత్సాహం ఇవాళ పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభలోనూ స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అసోంలో బీజేపీ వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడమే కాకుండా, పుదుచ్చేరిలో ఎన్డీయే రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల గెలుపోటములపై చర్చ జరుగుతున్నా, బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం అత్యంత విశిష్టమైనదని, అది రాష్ట్రంలోని బానిస సంకెళ్లను తెంచివేసిందని ఆయన అభివర్ణించారు. ఇదే క్రమంలో తెలంగాణలోనూ రాజకీయ మార్పును ప్రజలు బలంగా కోరుకుంటున్నారని, ఇక్కడ కూడా బీజేపీ సర్కార్ ఏర్పడాలనే మాట ప్రతి ఒక్కరి నోటా వినిపిస్తోందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని బెంగాల్ ప్రజలు ఆశీర్వదించినట్లుగానే.. తెలంగాణలోనూ ఆశీర్వదించాలని ప్రధాని మోడీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో గెలిచామని, తర్వాత బీజేపీ లక్ష్యం తెలంగాణే అని పేర్కొన్నారు. ఇక్కడి కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. 'అబ్ కీ బార్ మోడీ సర్కార్ నినాదం' వినిపిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేలుతోందని ఫైర్ అయ్యారు. బెంగాల్ ప్రజలు టీఎంసీ, లెఫ్ట్ పార్టీలను తిరస్కరించారని అన్నారు. మమత నియంతృత్వాన్ని బెంగాల్ ప్రజలు ఎదిరించారని ప్రధాని మోడీ అన్నారు.

# 16 నుండి జరిగే సెంట్రింగ్ కార్మికుల బంద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



**మల్కాజిగిరి, మే 10 (నినాదం):** ఈరోజు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారిని ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సెంట్రింగ్ పని బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల సమస్యల సాధన కోసం ఈ నెల 16వ తేదీ నుండి సెంట్రింగ్ పని బంద్‌కు పిలుపునిస్తున్నామని, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లను వినిపించారు. వాటిలో ముఖ్యంగా భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయడం, 55 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు నెలకు రూ.3,000 పెన్షన్ అందించడం, ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించడం, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు నష్టపరిహారాన్ని రూ.20 లక్షలకు పెంచడం వంటి అంశాలు ఉన్నాయని, సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలపై వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని, స్క్రాప్ దుకాణాల్లో అక్రమంగా మెటీరియల్ కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీ కూల్చివేతల సమయంలో ముందుగా సెంట్రింగ్ మెటీరియల్ తొలగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో సెంట్రింగ్ సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు చెందిన నేరేడ్ మెట్ జోన్, మల్కాజిగిరి, అల్వాల్ ప్రాంత ప్రతినిధులు విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, గంగారాం, చిత్తారి, రామకృష్ణ గౌడ్, శ్రీనివాస్, మోహన్, మహేష్, కృష్ణ, చాంద్ పాషా, పరశురాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

MANAPPURAM HOME FINANCE LTD.

**మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

ఇంతకుముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923KL2010PLC039179, 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి దేవాలయం దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567.

**డిమాండ్ నోటీసు**

భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారిచే జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O. 3466 (E), తేది: 18 డిసెంబర్, 2015తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట సదరు చట్టముగా వ్యవహరించబడును)లోని సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1)లోని క్లాజ్ (m) లో సబ్-క్లాజ్ (iv) పరిధిలో ఆర్థిక సంస్థగా మరియు కంపెనీల చట్టము 1956 క్రింద నమోదైన కంపెనీగా భారత దేశములోని వివిధ ప్రదేశములలో బ్రాంచ్‌లు కలిగి ఉండి మరియు నమోదిత కార్యాలయము 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి దేవాలయం దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ-680567 కలిగిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి అధీకృత అధికారి నివాస యూనిట్ల కొనుగోలు మరియు/లేదా నిర్మాణం కొరకు ముందస్తు రుణముల యొక్క వ్యాపారమును చేయుచున్నారు. దిగువ తెలిపిన టేబుల్‌లోని కాలమ్ నెం. 2 లో తెలిపిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణమును పొందినారు. SARFAESI చట్టము క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన MAHOFN సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 2తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ నోటీసులో తెలిపిన మొత్తము మరియు దానిపై తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేసినారు. కానీ అట్టి నోటీసులు వివిధ కారణముల వలన వారిలోని కొందరికి అందజేయబడలేదు. వారి కొరకు మరియు అదనముగా దిగువ తెలిపిన సదరు రుణగ్రహీతల సమాచారం కొరకు ఈ బహిరంగ నోటీసు జారీ చేయడమైనది.

| క్ర. సం. | రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నెం./బ్రాంచ్ | ఆసక్తి వ్యక్తీకరించిన సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరణ | ఎన్‌పి తేది | నోటీసు పంపిన తేది & బకాయి మొత్తం |
| --- | --- | --- | --- | --- |
| 1 | కుంబాల అర్చన, ములుగు చంద్రకళ, ములుగు ప్రతాప్ కుమార్/ NHL01110013259/ తిరుమల టాకీస్ క్రాస్ రోడ్ | తెలంగాణ పిన్: 503307, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా భీంగల్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా నిజామాబాద్, జిల్లా మరియు జిల్లా పరిషత్ నిజామాబాద్, మండల పరిషత్ భీంగల్, గ్రామపంచాయతీ పిప్రి, భీంగల్ మం॥, పిప్రి గ్రా॥ వద్ద ఉన్న ఆస్తి ప్లాట్ యొక్క మొత్తం స్థలం ఏరియా విస్తీర్ణము: 1236.55 చ॥అ॥లు లేదా 137.39 చ॥గ॥లు లేదా 114.87 చ॥మీ॥లు మరియు ఆర్‌సిసి రూఫ్ బిల్టప్ ఏరియా 724.24 చ॥అ॥లతో ఆర్.సి.సి. రూఫ్ గృహము జి.పి. నెం. 4-31 యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: పఠాని షుష్ప ఇల్లు, పడమర: రోడ్డు, దక్షిణం: రోడ్డు, ఉత్తరం: సూర వడిపి వర్షయ్య ఖాళీ స్థలం & ఇల్లు. | 10-04-2026 | 13-04-2026 & రూ. 876921/- |

కావున ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతకు వ్యతిరేకముగా పైన చూపించిన విధముగా రావలసిన పూర్తి బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించమని పైన తెలిపిన రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలను కోరడమైనది. పూర్తి బకాయి మొత్తము మరియు తదుపరి వడ్డీతో సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత చెల్లించుటలో విఫలమైతే, MAHOFIN వారు పైన తెలిపిన విధముగా ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చేయుట కొరకు సెక్షన్ 13(4) క్రింద ముందుకు సాగెదరు, చట్టము మరియు అందులో ఏర్పడిన రూల్స్ క్రింద పేర్కొన్న విధముగా ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు చర్యలు తీసుకొనబడును. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(8)లో వివరించిన విధముగా అమ్మకం రూపములో బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం లేదా బహిరంగ వేలం కొరకు నోటీసు ప్రచురణ తేదీలోగా ఏ సమయములోనైనా పూర్తి బకాయి మొత్తము మరియు వ్యయాలు, ధార్జీలు & MAHOFIN వారిచే చెల్లించిన ఖర్చులతో మీరు చెల్లించినచో సదరు తనఖాను విడిపించుకొనవచ్చునని మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(13) ప్రకారం అమ్మకం, లీజు లేదా వేరే ఇతర పద్ధతులలో సెక్యూర్డ్ ఆస్తులను బదిలీ చేయుట మరియు/లేదా వ్యవహరించుట నుండి మీరు నిషేధించబడినారని గమనించగలరు.

ప్రదేశం: నిజామాబాద్, తేది: 11-05-2026 సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

## ఎల్‌హెచ్‌ఎస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, మే 10 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న ఎల్‌హెచ్‌ఎస్ (లిమిటెడ్ హాయిట్ సబ్వే) నిర్మాణ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పాటు, వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో తల్లుల పాత్ర అమూల్యం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, మే 10 (నినాదం):** మదర్స్ డే సందర్భంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డివిజన్ పరిధిలోని హనుమాన్ టెక్కిడి వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్నిశంకర్ శశాంక చారిటబుల్ టెస్ట్ చైర్మన్ డాక్టర్ రజిని శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తల్లి గొప్పదనాన్ని వివరిస్తూ, సమాజ నిర్మాణంలో తల్లుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిని గౌరవించాలని, ప్రేమాభిమానాలతో చూసుకోవాలని సూచించారు. అనంతరం మదర్స్ డే సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, డిల్లీ పరమేష్, శరణ్ గిరి,, అతిక్ పాషా పాల్గొన్నారు. స్థానికులు శ్రీనివాస్ రావు, స్వరూప, హరిత తదితరులు హాజరయ్యారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



**అల్వాల్, మే 10 (నినాదం):** అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని మల్కాజ్గిరి నియోజకవర్గ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. 194 డివిజను భూదేవి నగర్ లో జరుగుతున్న బాక్స్ డ్రైన్ మరియు రోడ్ కటింగ్ పనులను డివిజన్ కాంగ్రెస్ నాయకులు మల్కాజ్గిరి నియోజకవర్గ ఇన్చార్జ్ తోట లక్ష్మి కాంత్ రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డి ఈ మహేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కేబుల్ శేఖర్, శివ, బాలకృష్ణారెడ్డి, నిమ్మ అశోక్ రెడ్డి, టీవీ భాస్కర్, జనార్ధన్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## మరియమ్మ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

### ఇండోర్ బ్యాట్మెంటన్, పికిల్ బాల్ కోర్టుల నిర్మాణానికి రూ.16.13 కోట్లు మంజూరు






**మల్కాజిగిరి, మే 10 (నినాదం):** నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని ఆర్ కె పురంలో తమిళ వాసుల ఆరాధ్య దైవమైన మరియమ్మ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి ని దేవాలయ నిర్మాణానికి సహకరించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ కె పురం ప్రాంత అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. యువత క్రీడల్లో రాణించేలా ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఆర్ కె పురంలో ఇండోర్ బ్యాడ్మింటన్, పికిల్ బాల్ కోర్టుల నిర్మాణం కోసం రూ.16.13 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత స్థానిక యువతకు మెరుగైన క్రీడా వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, చిందం శ్రీనివాస్, జెకె సాయి గౌడ్, నవీన్ రాజ్, అవినాష్, రాజేష్ గౌడ్, విజయ సాయి, విక్రమ్, డేవిడ్ రాజ్, స్థానిక కాలనీ వాసులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ నెహ్రూనాయక్.!

- బిల్లులు రాకుండా అడ్డుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ !
- కక్షపూరితంగానే నా బిల్లును ఈసీ నెహ్రూ నాయక్ అడ్డుకుంటున్నారు
- బాధితుడు జరుపుల విజయ్ నాయక్



**డోర్నకల్ /మరిపెడ, మే 10(నినాదం):** గ్రామపంచాయతీ అభివృద్ధికై పాటుపడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మరిపెడ మండలం బాల్య తండా గ్రామ పంచాయతీ రైతుల బాధలు చూడలేక సీసీ రోడ్డు,గ్రావిటీ రోడ్డును నెల రోజుల్లోనే పూర్తి చేశానని బాధితుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు జరుపుల విజయ్ నాయక్ తన బాధను మీడియాతో వెళ్లిబుచ్చుకున్నారు. రోడ్డు పూర్తయిన వెంటనే ఎంపీడీవో,ఏ పీ ఓ సంబంధిత అధికారులు చూసి ఆన్లైన్ రికార్డులు చేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ భూక్యా నెహ్రూ నాయక్ పేమెంట్ రాకుండా చేశారన్నారు.ఈసీ భూక్యా నెహ్రు నాయక్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తనతో పాటు వర్క్ చేసిన వారికి ముందుగా బిల్లులు చేశారన్నారు. వారి వద్ద నుండి 20 నుండి 30 వేల వరకు సొమ్మును తీసుకొని బిల్లు లను అందజేశారన్నారు.నాపై కక్షపూరితంగానే వ్యవహరిస్తూ నా బిల్లును చేయకుండా నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.ఈ విషయంపై సంబంధిత ఎంపీడీవో,డి ఆర్ డి ఓ, జిల్లా కలెక్టర్ కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.2023-2024 సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ వర్క్ చేసిన వారికి వచ్చిన బిల్లులను 2025 సంవత్సరంలో వర్క్ చేసిన వారి వద్ద నుండి సొమ్మును లంచంగా తీసుకుని బిల్లును అందజేశారన్నారు.నా సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తారని ఆశిస్తున్నాను అన్నారు.లేనిపక్షంలో గ్రామపంచాయతీ మంత్రి సీతక్క,సంబంధిత అధికారులకు కూడా తన సమస్యలను తెలియజేస్తానని తెలిపారు.ఇప్పటికైనా సమస్యను పరిష్కరిస్తారని కోరుకుంటున్నాను..

**అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న ఈసీ భూక్యా నెహ్రూ నాయక్**

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ భూక్యా నెహ్రూ నాయక్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ మరిపెడ మండలం సోమ్లా తండా గ్రామపంచాయతీ, ఎల్లంపేట,బొట్య తండా గ్రామపంచాయతీలలో ఈసీ భార్య పేరు తో వర్క్ లు చేసినట్టు బిల్లును విత్ డ్రా చేసుకున్నారు.ఒక గవర్నమెంట్ అధికారి తన భార్యకు జాబ్ కార్డు ఎలా వస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పని కావాల్సిన తిరుగుతున్న నిరుపేదలకు పని కల్పించకుండా,ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుని తింటుంటే పై స్థాయి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదన్నారు.ఇప్పటికైనా ఈసీ భూక్యా నెహ్రూ నాయక్‌ను విచారణ చేపట్టి, సొమ్మును రికవరీ చేయాలని కోరారు.

## భారత రాజ్యాంగం ప్రతి భారతీయునికి ఉత్తమ కరదీపిక





- సీనియర్ నాయకులు ప్రసాద్ గౌడ్

**జవహర్ నగర్, మే 10 (నినాదం):** భారత రాజ్యాంగం ప్రతి భారతీయునికి ఒక ఉన్నత మార్గదర్శి లాంటిదని భారత రాజ్యాంగం పౌరులకు కరదీపిక అని రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ఆదేశ సూత్రాలు విధిగా పాటించాలని జవహర్ నగర్ సీనియర్ నాయకులు బండ కింది ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ మహనీయులకు భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 92వ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ నాయకులు బండకింది ప్రసాద్ గౌడ్ హాజరై మహనీయులకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఉన్నతమైందని రాజ్యాంగ హక్కులను కాపాడుకునే దిశగా సబ్బండ వర్గాలు ఏకమై రాజ్యాంగ హక్కులను కాపాడుకునే దిశలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మందుకు రావాల్సిందిగా పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రజలందరూ ఔషోపనబట్టి విధిగా రాజ్యాంగ మౌలిక సూత్రాలను గౌరవించాలన్నారు. భారతదేశంలో రాజ్యాంగమే ఉన్నతమైందని భారత రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరు గౌరవభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో టి కె ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల యాదగిరి, గడ్డం శ్రీనివాస్, అల్వాల వెంకన్న, కొమ్ము ఇలాకాంత్, గడ్డం గిరి, గాదె రమేష్, రెహమాన్ మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నరేందర్ బాబుకు ఘన సన్మానం



**రాజేంద్రనగర్ మే 10 (నినాదం):** తలసీమియా మరియు సికిల్ సెల్ వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్న తలసీమియా సికిల్ సెల్ సొసైటీ , పలువురు రక్తదాతలను ఘనంగా సత్కరించింది. ఇందులో భాగంగా, ఇప్పటివరకు 41 సార్లు రక్తదానం చేసిన నరేందర్ బాబు అంకితభావాన్ని గుర్తించి, యాజమాన్యం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపింది. రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించినందుకు యాజమాన్యం ఆదివారం ప్రత్యేకంగా సత్కరించింది. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ కార్యక్రమంలో తోటి రక్తదాతలు చందు, అశోక్ లతో కలిసి ఈ గౌరవాన్ని అందుకోవడం పట్ల రక్తదాత సంతోషం వ్యక్తం చేశారు. రక్తదాతల నిరంతర తోడ్పాటును గుర్తిస్తూ, చిన్నారుల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తలసీమియా సికిల్ సెల్ సొసైటీ బృందానికి ధన్యవాదాలు తలసీమియాతో పోరాడుతున్న పిల్లలకు నా వంతు మద్దతుగా నిలవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సేవా కార్యక్రమం మరింత మందిని రక్తదానం వైపు నడిపించేలా స్ఫూర్తినిస్తుందని అన్నారు.

## గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక కరాటే పోటీల ప్రారంభం

### ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

### నందారం నరసింహా గౌడ్



**అమీన్‌పూర్, మే 10(నినాదం):** పటాన్చెరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదో జాతీయ స్థాయి కరాటే పోటీలను పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి అమీన్పూర్ మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహా గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నందారం నరసింహా గౌడ్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే క్రీడ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. యువత క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

## అమ్మను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత



**మల్కాజిగిరి, మే 10 (నినాదం):** అమ్మను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల నరేష్ ముదిరాజ్ అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం మీర్జాలగూడలో తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల నరేష్ ముదిరాజ్, పితాని సత్యనారాయణ ల ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ప్రేమకు ప్రపంచంలో ఏదీ సాటి రాదని అమ్మ త్యాగం, మమకారం, అనురాగం ప్రతి మనిషి జీవితానికి వెలుగునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పితాని మణి, అనూష, రాధిక, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ మిత్రుని కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు



**హుజూర్‌నగర్, మే 10 (నినాదం):** మఠంపల్లి మండల కేంద్రంలోని వివి ఉన్నత పాఠశాల మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ లో 1993బి 94 సంవత్సరములో పదవ తరగతి చదివిన పాఠశాల పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో వారితో చదివిన నరసింహ చారి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఆ కుటుంబం పెద్దదిక్కుని కోల్పోయిందని మాతో కలిసి చదివి కలిసి తిరిగిన స్నేహితుడు మరణించడం చాలా బాధాకరం అని వారి తోటి స్నేహితులు ఆదివారం స్వయంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మేము ఉన్నాము మీ కుటుంబానికి అండగా అని సహృదయముతో కొంత ఆర్థిక సహాయాన్ని వారి సతీమణికి వీరయ్య రాజశేఖర్ రెడ్డి జానకిరామ్ రెడ్డి రామయ్య ప్రసాద్ అందజేశారు.

## ప్రజాగ్రహ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



**కాటారం, మే 10(నినాదం):** తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ కాటారం మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్ పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రజా ఆగ్రహ సభకు కాటారం మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకంగా ఓటు వేసి అడ్డుకున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రజా ఆగ్రహ సభల ద్వారా మహిళలు, యువత, పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని తెలంగాణ బీజేపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని, అయినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు బీజేపీ చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయంతో వచ్చే రోజుల్లో తెలంగాణలో కూడా పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొంతల రవి, మండల ఉపాధ్యక్షులు గంట అంకయ్య, ఇంజమూరి సాధనందం, పోలింగ్ బూత్ అధ్యక్షులు కట్టెకోళ్ల పర్వతాలు, ఆత్మకూరి రమేష్, గంట మహేష్, వేముల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి

### మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్



**మల్కాజిగిరి, మే 10 (నినాదం):** సమయం ఎప్పుడైన ప్రతిక్షణం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ బాలసరస్వతి నగర్ లో 50 ఏళ్ల నాటి బారి మర్రి చెట్టు కరెంటు తీగల మీద పడి సుమారు వంద ఇండ్లకు కరెంటు సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక నాయకులు ఫోన్ ద్వారా సమస్యను తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని హైడ్రా డిఆర్ఎఫ్, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి భారీ మర్రి చెట్టు కొమ్మలను తొలగించి, బస్తీ వాసులకు యధావిధిగా కరెంటును సరఫరా పునరుద్దరించారు. కాలనీ వాసులు సమస్యని పరిష్కరించినందుకు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, సంధ్య, బ్రహ్మం, శిల్ప, కృష్ణ, శ్రవణ్, శ్వేత, పవన్, వరుణ్, వైష్ణవి, నాగరాజ్, వర్షిత్ అరుణ, లత అనిత, విశ్వజిత్, కీర్తన, దీక్షిత, సారిక, కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో బోరు మోటార్ అందజేత



**దుబ్బాక, మే 10: (నినాదం):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలోని 6వ వార్డు మెంబర్ ఏయ్య భాస్కర్ తన స్వంత ఖర్చులతో కాలనీ ప్రజలకు బోరు మోటార్ అందజేసి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. కాలనీలో కొంతకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించిన ఆయన వెంటనే స్పందించి బోరు మోటార్ ఏర్పాటు చేయించడంతో స్థానికులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. బోరు మోటార్ ప్రారంభించడంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ వార్డ్ మెంబర్ ఏయ్య భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ముందుండి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఏయ్య భాస్కర్ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఆదర్శ వార్డ్ మెంబర్‌గా నిలుస్తున్నారని తెలిపారు. వార్డ్ మెంబర్‌గా ఎన్నికైన మరుసటి రోజే వార్డులో పనిచేయని విద్యుత్ దీపాలను స్వంత ఖర్చులతో మరమ్మతులు చేయించి ప్రజల ప్రశంసలు పొందారని గుర్తు చేశారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఏయ్య భాస్కర్‌కు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# కూతురి కల కోసం కూలీ తల్లిదండ్రుల పోరాటం

**కూలీ చేతుల్లో కష్టం.. కూతురి కళ్లల్లో కలలు**
**పేదరికం అడ్డొచ్చినా.. చదువుతో ఎదగాలనే శ్రావ్య సంకల్పం**
**రోజూ కూలీకి వెళ్లే తల్లిదండ్రులు.. కూతురు భవిష్యత్తుకోసం ఆవేదన**
**దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్న ప్రతిభావంతురాలు శ్రావ్య**





**కోదాడ, మే10 (నినాదం) :** పేదరికం వారి జీవితాన్ని చుట్టుముట్టింది.. సొంతంగా ఉండేందుకు ఇల్లు లేదు.. రోజూ కూలీకి వెళ్తేనే కుటుంబానికి అన్నం దొరికే పరిస్థితి. అయినా తమ కూతురు చదువుకుని మంచి స్థాయికి చేరాలని శీలం రేణుక, పరశురాములు కలలు కంటున్నారు. కష్టాలు ఎంత ఉన్నా చదువే పిల్లల భవిష్యత్తును మార్చగలదనే నమ్మకంతో బతుకుబండిని లాగుతున్నారు. అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామానికి చెందిన ఈ దంపతులు ప్రస్తుతం హైదరాబాద్‌లో నర్సరీలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడితేనే కుటుంబానికి రెండు పూటల భోజనం దొరికే పరిస్థితి. అయినా తమ కుమార్తె చదువుకు ఎలాంటి లోటు రాకూడదని ఎన్నో ఇబ్బందులు పడుతూ చదివిస్తున్నారు. వారి కుమార్తె శీలం శ్రావ్య చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచింది. పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపిస్తూ ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. చదువుపై ఆసక్తితో మరింత ఉన్నత స్థాయికి చేరాలని కలలు కంటోంది. అయితే ఇప్పుడు ఆ కలల ముందుకు ఆర్థిక సమస్యలు అడ్డుగా నిలిచాయి. రెండో సంవత్సరం ఫీజులు, హాస్టల్ ఖర్చులు భరించే స్థోమత లేక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. "మేము కూలీ చేసి ఇంతవరకు చదివించాం.. కానీ ఇక మా వల్ల కావడం లేదు. మా అమ్మాయి చదువు మధ్యలో ఆగిపోతుందేమోనని భయపడుతున్నాం" అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతు న్నారు. "మా కూతురు బాగా చదువుకుని ఉద్యోగం సాధించి కుటుంబ పరిస్థితిని మార్చాలని కలలు కంటోంది. ఆమె చదువు ఆగిపోకుండా దాతలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలి" అంటూ శీలం రేణుక, పరశురాములు వేడుకుంటున్నారు.

కష్టాలను జయించి చదువుతో ముందుకు సాగుతున్న శ్రావ్యలాంటి విద్యార్థినులకు సమాజం అండగా నిలిస్తే.. మరో పేదింటి అమ్మాయి భవిష్యత్తు వెలుగులతో నిండిపోతుంది. చిన్న సహాయం ఒక కుటుంబానికి ఆశగా, ఓ అమ్మాయి భవిష్యత్తుకు బలంగా మారనుంది.

# అమరచింతలో కామ్రేడ్ సామేలు సంస్మరణ సభ

**సామేలు ఆశయాలను కొనసాగిద్దాం**
**టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం**






**అమరచింత, మే 10, (నినాదం) :** టి యు సి ఐ జిల్లా జిల్లా అధ్యక్షులు అమరుడు కామ్రేడ్ సామేలు ఆశయాలను కొనసాగిస్తామని టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు కే స ర్యం అన్నారు. ఆదివారం అమరచింత పట్టణంలోని సామేలు నివాసం వద్ద ఆయన సంస్కరణ సభను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో సామేలు చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సూర్యం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.జీ. రామచందర్ లు మాట్లాడుతూ పేదరికంతో జీవించిన సామేలు బీడీ యూనియన్ పుట్టినప్పటి నుండి కార్మికుల పక్షాన పోరాడి ముందు వరసలో ఉన్నారని పేర్కొన్నారు. ఆనాటి బీడీ యాజమాన్యాలు కార్మికులపై ఆకు జరిమానా, పొగాకు జరిమానా, బీడి జరిమానా కార్మికులపై జరిగిన దౌర్జన్యాలకు సామేలు ఎదురొడ్డి నిలిచారని అన్నారు. అలాంటి పోరాట పటిమ గల సామేలు మన మధ్య లేకపోవడం తీరని నష్టమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టిపిబిడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి జేఎన్ వదానం మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం చట్టాలు అమలు కోసం బీడీ కార్మికుల భవిష్యత్తు బాగు కోసం కామ్రేడ్స్ నిరంతరం కృషి చేశారని కితాబిచ్చారు. సామీలు పోరాట పటిమ గురించి టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా కమ్యూనిస్టుగా జీవించడం అంటే అది కత్తి మీద సామని పేర్కొన్నారు అలాంటి నాయకుడు మనమధ్య లేకపోవడం వీరి కార్మిక ఉద్యమానికి తీవ్రం నష్టమన్నారు కామ్రేడ్ సామెలు ఆశయాలను పార్టీ శ్రేణులు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోళ్ల వెంకటన్న, కొండన్న, జిల్లా సహాయ కార్యదర్శి సి.రాజు, వెంకటేష్ గౌడ్, నరసింహులు, పెంటన్న, గోపాలు, సుమిత్రమ్మ, సువార్త, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అనంత సాహిత్య సంస్కృతి విశ్వవ్యాప్తం అవ్వాలి

**ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్.**
**వైభవంగా అనంత సాహిత్య సంస్కృతిక వేదిక**
**శంకర్ పల్లి శ్రీ చైతన్య స్కూల్‌లో 3వ వార్షికోత్సవం**
**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవులు, పండితులు**



**చేవెళ్ల మే10 (నినాదం):** అనంత సాహిత్య సంస్కృతి విశ్వవ్యాప్తం అవ్వాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఆదివారం చేవెళ్ళ నియోజకవర్గం శంకర్ పల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలలో అనంత సాహిత్య సాంస్కృతిక మూడో వార్షికోత్సవ వేదిక తుల్జారాం సింగ్ ఠాకూర్అ ధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేశపతి శ్రీనివాస్, విశిష్ఠ అతిథులుగా డా తూర్పు మల్లారెడ్డి గౌరవ అతిథులుగా బి. పి. నర్సింహులు గుప్తా అనంత అధ్యక్షులు టి. ఆశీర్వాదం ప్రత్యేక అతిథులుగా కోటం చంద్రశేఖర్ అనంత ఉపాధ్యక్షులు మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం పాల్గొన్నారు. అనంత సాహిత్య వేదిక ద్వారా ప్రతి సంవత్సరం ఇస్తున్న శ్రీమతి సుగుణ దోరవేటి తల్లి దండ్రుల పేరు మీద సాహిత్య రంగంలో ఏర్పాటు చేసిన జీవన సాఫల్య పురస్కారాన్ని, తొలి కాళోజీ పురస్కార గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్ చింతామణి జానకిరామారావు, జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి మున్సిపల్ వైస్ ఛైర్మన్ పేరు మీద కళారంగంలో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కడియాల మధుసూదన రావు, చిగురాల్ పల్లి ప్రసాద్ గారల సంపాదకత్వంలో వచ్చిన అనంత తృతీయ వార్షిక సంచిక ను, మణిపూసల కవితా ప్రక్రియలో రచించిన భావజలధి పుస్తకాన్ని, ఆకుల మల్లికార్జున శివ కౌముది పుస్తకాన్ని, ప్రముఖ కవి రచయిత దోరవేటి రచించిన శ్రీరామ దర్శనం నాటకమును ఆవిష్కరించారు.. అనంత సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి కమలేష్ సమన్వయంతో, నిర్వహణతో జరిగిన ఈ అద్భుతమైన సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సాహిత్యం, కళలు స్వేచ్ఛగా వికసించాలని దేయంతో ఈ సంస్థ రూపొందడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. కాళోజీ నారాయణ, సురవరం ప్రతాపరెడ్డి ల వంటి కవుల సాహితీ, సామాజిక సేవలను గుర్తు చేశారు. అనంతగిరి ఔషధగిరి అని కొనియాడారు. కవి రాసేటప్పుడు మాత్రమే తల వంచుతాడు. రాసిన తర్వాత తల ఎత్తుకొని నిలబడతాడు అని చాటి చెప్పాడు. కవి అన్నవాడు సమాజం గతి తప్పుతున్నప్పుడు దిక్సూచి లాంటి వాడు అని పేర్కొన్నాడు. మన భారతీయ జీవన విధానంలో, ఇతిహాసాలలో విశ్వ శ్రేయస్సును కోరుకునే విలువలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షరీఫ్ రవూపొద్దిన్ శివకుమార్, కడియాల మధుసూదన రావు, రామకృష్ణా రాజు, మావిశ్రీ మాణిక్యం, తాడూరు మోహనాచార్యులు దుబ్బాకుల కృష్ణస్వామి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ వెన్నెల సత్యం, చిగురాల్ పల్లి ప్రసాద్ తెలంగాణ రాష్ట్రం నలుమూల నుండి వచ్చిన వంద మందికి పైగా కవులు, పండితులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకాన్ ఎక్సెన్స్ సైకాలజిస్ట్ అవార్డు అందుకున్న విజయలక్ష్మి.



**పాలేరు, మే10(నినాదం) :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన పిన్నెబోయిన విజయలక్ష్మి అత్యంత సైకాలజిస్ట్ అవార్డును పొందారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ దశాబ్ది ఉవుమెన్ ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇస్తువాల సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమం లో సైకాలజిస్ట్ విజయలక్ష్మి కి అవార్డు ను అందించారు. పిన్నెబోయిన విజయలక్ష్మి కి,వుమెన్ ఐకాన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైకాలజీ" అవార్డు ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందుకున్నారు. హైదరాబాదులోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్, జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో విజయలక్ష్మి కి అవార్డు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తనకు అవార్డు రావటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ అవార్డు అందించిన ప్రోత్సాహంతో ముందు సాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, క్యాంపు కార్యాలయం ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి గోవింద రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రజా ప్రతినిధులు మేధావులు ఆమెను అభినందించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు మోత్కుపల్లి రామ చంద్ర, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిన్నెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోదీ బహిరంగ సభకు.. తరలిన నేలకొండపల్లి బిజెపి కార్యకర్తలు..




**పాలేరు మే, 10( నినాదం) :** బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరగబోయే నరేంద్ర మోదీ గారి బహిరంగ సభకు నేలకొండపల్లి నుంచి బయలు దేరడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా కిరణ్, పాలేరు ఇంచార్జ్ నున్నా రవికుమార్, జిల్లా నాయకులు మన్నే కృష్ణారావు, సీనియర్ నాయకులు కోటి హనుమంత రావు,నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినూద్దీన్, కందరబోయిన వెంకటరమణ, గుండెపొంగు క్రాంతి, కందరబోయిన గోపి,కొండా హర్ష వర్ధన్, పుట్టా,సత్యానారాయణ, బ్రహ్మవరపు, నాగరాజు,లింగనబోయిన వెంకటేశ్వర్లు, మూడు రమేష్, జోగుపర్తి నారాయణరావు,పల్లపు ఉమ,బానోత్ శ్రీనివాసరావు, కూరపాటి రామాచారి, మీగడ గోపి, జెల్లా సురేష్,తదితరులు పాల్గొన్నారు..

## బెల్లం పట్టివేత : కేసు నమోదు




**ఆమనగల్లు, మే 10(నినాదం):** అమనగల్లు ఎక్సైజ్ పోలీసులు కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద జరిపిన తనిఖీల్లో భారీగా సారా తయారీ ముడి పదా ర్థాలను స్వాధీనం చేసుకున్నారు. మారుతీ ఎర్టిగా వాహనంలో తరలిస్తున్న 750 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పటికను సీజ్ చేశారు. ఈ కేసులో కేతావత్ మోహన్, దేరంగుల నరేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. ఈ తనిఖీలో సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కేతావత్ వీర్యానాయక్ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**మిర్యాలగూడ మే 10 (నినాదం):** మదర్స్ డే సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలం కేతావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తల్లిదండ్రులు వీర్య నాయక్, హషా ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిలావర్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ గా వీర్యా నాయక్ చేసిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమన్నారు. తల్లిదండ్రుల సేవ ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత గొప్పదని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# సమర్ధవంతంగా పని చేసే అధికారులకే ప్రాధాన్యశీ

**వ్యవసాయ అధికారులను సన్మానించిన జువ్వాడి బ్రదర్స్**



**కోరుట్ల, మే10 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్లో రైతులకు యూరియా సరఫరా ప్రతిష్టాత్మకంగా చేపట్టగా నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు యూరియా సరఫరా చేయడంలో సమర్థవంతంగా పని చేశారని మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు వర్ధంతి సందర్భంగా వ్యవసాయ అధికారులను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, మే10 (నినాదం) :** కోరుట్ల నియోజకవర్గంలో ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని, సొంత ఇల్లు లేని వారందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల మండలం మోహన్ రావు పేట లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మించుకొని ఆదివారం గృహప్రవేశం చేసిన కుటుంబాన్ని అభినందించి వారికి నూతన వస్త్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడతూ నియోజక వర్గంలో ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని సొంత ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సరికెలలతిక నరేష్, కిషన్ రావు, జాగర్ల మహేష్ కోరుట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎలేటి మహిపాల్ రెడ్డి, సైదు గంగాధర్, మాజీ ఎంపిటీసీలు పడాల లచ్చన్న, చేపూరి కృష్ణారెడ్డి, నరేష్, శశి, బర్కం రాజేందర్, గంగాధర్ రాజు, రాజేష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక



**మంచిర్యాల, మే10 (నినాదం):** డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 01వ డివిజన్ రాజీవ్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూడు నెలల తరువాత లక్కీ డ్రా సిస్టంతో అర్హులైన లబ్ధి దారులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారుల దగ్గర ఎవరైనా డబ్బులు తీసుకుంటే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ గారు, మేయర్ ధర్ని మధుకర్ గారు, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# పలు వివాహ శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, మే 10 (నినాదం) :** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో జరిగిన పలు వివాహ శుభకార్యాలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘన స్వాగతం పలికారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నూతన దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్య సంపదలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆహ్వానం మేరకు ప్రతి కుటుంబ శుభకార్యంలో పాల్గొంటూ, వారి ఆనందాల్లో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, అనిల్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం

**మున్సిపల్ చైర్ పర్సన్ సమతా దేవర వెంకటరెడ్డి**



**చేవెళ్ల,మే10( నినాదం):** సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఆత్మవిశ్వాసం ఆత్మ గౌరవం అని మునిసిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి పేర్కొన్నారు.. ఆదివారం చేవెళ్ల మునిసిపల్ పట్టణం దామరగిద్ద వార్డ్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్,మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, దామరగిద్ద కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా,కలసి ఆదివారం నాడు ఘనంగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్..మాట్లాడుతూ, సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి అర్థం గౌరవం ఆత్మవిశ్వాసం అని అన్నారు..అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, పెద్దోళ్ల దయాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి,మాజీ ఉప్ప సర్పంచ్ మాల వెంకటయ్య,నాయకులు, మహేందర్, ల్యాకత్, అంజయ్య, రాజు, యాదగిరి, స్వామి, రాంచందర్, నవీన్, భీమ్ రాజ్, మారుతీ, శ్రీనివాస్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల వద్ద చిన్నారుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**వేసవి సెలవుల్లో ఈతకు వెళ్లే విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలి**
**ప్రజలకు విజ్ఞప్తి చేసిన నల్లబెల్లి ఎస్సై సాయి ప్రసన్న కుమార్**



**నల్లబెల్లి, మే10 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండ లం వేసవి సెలవుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లి ఈత కొట్టే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై సాయి ప్రసన్న కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి కాలంలో పాఠశాలలకు సెలవులు ఉండటంతో చిన్నారులు స్నేహితులతో కలిసి సరదాగా చెరువుల వద్దకు వెళ్లి ఈత నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా రని, అయితే సరైన అవగాహన లేకపోవడం, లోతైన ప్రాంతాలపై సమాచారం లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లోని చెరువుల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల కారణంగా లోతైన గుంతలు ఏర్పడినట్లు పేర్కొన్నారు. ఈ గుంతలు బయటకు కనిపించకపోవడం వల్ల చిన్నారులు ఈత కొడుతూ వాటిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఒంటరిగా చెరువుల వద్దకు పంపవద్దని, పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకుంటూ వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించా రు. గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు కలిసి చిన్నారులకు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, గ్రామాల్లో అనుమానాస్పద పరిస్థితులు లేదా ప్రమాదకర ప్రాంతాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి విషాద సంఘటనలను అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు.

# నూతన గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే సత్యం



**మల్యాల , మే 10 (నినాదం):** మండలం లోని ముత్యంపేట గ్రామం లో ఆదివారం ఇందిరమ్మ లబ్ధిదారు మల్యాల మమత -వినోద్ ల గృహ ప్రవేశానికి ముఖ్య అతిథి గా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని నూతన గృహ ప్రవేశం ప్రారంభోత్సవం చేసి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దారం అదిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లిశ్వరి శ్రీనివాస్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెవుల మద్ది శ్రీనివాస్,పార్టీ అధ్యక్షుడు

ఆనంద రెడ్డి,హరినాథ్,మల్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం: అంతర్ముఖతకు ఆహ్వానం

నేడు ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం సందర్భంగా




అహంకారం ... ఇది మనిషి మనోభావాల్లో అత్యంత కీలకమైన, సున్నితమైన భావన. 'నేను' అనే భావంతో మొదలయ్యే వ్యక్తిత్వ బలాన్ని నిర్మించడంలో ఇది ఒక భాగం. సరియైన పరిమితిలో ఉండే అహం మనిషికి ఆత్మ విశ్వాసాన్ని, లక్ష్య సాధనకు ప్రేరణను అందించగలదు. కానీ అది మితి మీరినపుడు, మన జీవితంలోని అనేక రంగాల్లో -- వ్యక్తిగతంగా, కుటుంబంగా, సామాజికంగా -- సమస్యలకు కారణమవుతుంది. ఇతరుల పట్ల తక్కువ తనాన్ని కలిగించే ధోరణి, అభిప్రాయాల నిరాకరణ, స్వార్థం, అసూయ, కోపం వంటి భావోద్వేగాలు అహంకార ప్రభావంతోనే కలుగుతాయి.

ఈ నేపథ్యంలో, ప్రతి సంవత్సరం మే 11న జరుపుకునే 'ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం' మనలోని అహంకారాన్ని గుర్తించి, దానిపై చైతన్యం కల్పించేందుకు ఒక ప్రత్యేక అవకాశం. 2018లో ప్రారంభమైన ఈ దినోత్సవం అంతర్జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలు, మైండ్‌ఫుల్‌నెస్ ఉద్యమాలు మద్దతు నిచ్చిన చైతన్య వంతమైన కార్యక్రమంగా అభివృద్ధి చెందింది. ఇది వ్యక్తిగత వికాసానికి, సామాజిక సఖ్యతకు అడ్డుకాదని, దానిపై అవగాహన పెంచుకుంటే మన జీవితం మరింత సమతుల్యంగా, సంతోషకరంగా ఉండగలదని ఈ దినోత్సవ సందేశం.

అహం ప్రతి మనిషిలో ఉంటుంది. అది ఉన్నంతవరకు వ్యక్తిత్వం ఉంటుంది. కానీ అహంకారం మారినపుడు, అది వ్యక్తిగత బలాన్ని కాక, బలహీనతగా మారుతుంది. ఆ స్థితిలో మనం వినయం కోల్పోతాం, ఇతరులను అగౌరవంగా చూసే ధోరణి పెరుగుతుంది. ఆత్మపరిశీలన లేని జీవితం అహం చేత నడిపించబడుతుంది. అలాంటి జీవితంలో స్నేహాలు బలహీనపడతాయి, బంధాలు తెగిపోతాయి, ఒంటరితనం పెరుగుతుంది. సామాజికంగా అహంకారం ఉన్న చోట అధికార సంస్థలు ప్రజలతో దూరంగా మారుతాయి. మాటల్లో గర్వం, ప్రవర్తనలో అహం ఉంటే ప్రజాస్వామ్య సంస్కృతి బలహీనమవుతుంది. మానవ సంబంధాల్లో సహనం, వినయం, పరస్పర గౌరవం కోల్పోతే సంక్షోభం తప్పదు. ఆధ్యాత్మికంగా చూస్తే కూడా అహంకారం మోక్షానికి అడ్డంకిగా పరిగణించబడుతుంది. ఉపనిషత్తులలో చెప్పిన "అహం బ్రహ్మాస్మి" అన్న వాక్యం ఆత్మజ్ఞానాన్ని సూచించినా, దాన్ని గర్వంగా అర్థం చేసుకుంటే అది ముక్తికి తలపెట్టి మార్గాన్ని మూసేస్తుంది.

ఈ దినాన్ని సరైన ఉద్దేశంతో జరుపు కోవాలంటే మనకు కొన్ని సాధనాలు అవసరం. ముఖ్యంగా ధ్యానం, యోగా వంటి మనస్సు నిలిపే ప్రయత్నాలు మనలోని భావోద్వేగాలను విశ్లేషించేందుకు ఉపయోగపడతాయి. ప్రతి రోజు మన ప్రవర్తనను పరిశీలించుకోవడం -- 'ఈ సందర్భంలో నేను అహంకారంతో ప్రవర్తించానా?' అనే ప్రశ్న వేయడం -- మనలో అంతర్ముఖత పెంపొందించేందుకు దోహద పడుతుంది. వినయంగా ఇతరులను గౌరవించడం, వారి అభిప్రాయాలను అంగీకరించడం కూడా అహంకారాన్ని తగ్గించే ప్రయత్నమే. అలాగే సానుభూతి -- మన చుట్టూ ఉన్నవారి బాధలను అర్థం చేసుకోవడం, సహాయం చేయడం -- మానవీయ విలువలను పెంపొందిస్తుంది.

ఈ దినోత్సవం గురించి ఇతరులకు తెలియజేయడం కూడా ఎంతో ముఖ్యం. సామాజిక మాధ్యమాల్లో, బహిరంగ చర్చల్లో, వర్క్‌షాప్‌ల ద్వారా ఈ విషయాన్ని ప్రచారం చేయవచ్చు. ఇదంతా మనకు ఒక్కరోజు గుర్తుండటానికి కాదు -- జీవితాంతం ఆచరించాల్సిన జీవన వెలుగు. ఎందుకంటే అహంకారం ఎప్పుడూ మనల్ని పరీక్షిస్తూ ఉంటుంది. దానిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా మన వ్యక్తిత్వాన్ని మెరుగు పర్చుకోవచ్చు. ఈ దినోత్సవం మనల్ని మనల్ని పరిశీలించుకునే మార్గానికి ఆహ్వానం ఇస్తుంది. అహంకారాన్ని నిర్మూలించ లేమేమో కానీ, దానిని గుర్తించి, నియంత్రించడం మన చేతుల్లోనే ఉంది. వినయం, జ్ఞానం, సానుభూతి అనే మానవ విలువలతో ముందుకు సాగితే -- మన జీవితం మాత్రమే కాక, మన చుట్టూ ఉన్న సమాజం కూడా శాంతియుతంగా, సమతుల్యంగా మారగలదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్... 9440595494**

# పాత్రలలో మాధవపెద్ది స్వరం పరకాయ ప్రవేశం

## నేడు మాధవపెద్ది సత్యం జయంతి



"వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాల వారి విందు, ఒహ్హోహ్హో నాకే ముందు" అనే అలనాటి మల్టీ స్టారర్ చిత్రరాజం మాయా బజార్ చిత్రంలోని పాటను వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదేమో. ఆ పాట గుర్తుకు రాగానే వెను వెంటనే కళ్ళ ముందు కదలాడతూనే రూపం ఎస్వీ రంగారావు ది. ఆ వెంటనే స్ఫురణకు వచ్చేది మాధవపెద్ది గాత్రమే. ఎస్వీఆర్ నటనకు జీవం పోసిన నేపథ్య గాయకుడు మాధవపెద్ది. అంతేకాదు, దుర్యోధనుడు, రావణుడు, ఘటోత్కచుడు ఇలా ప్రతినాయక పాత్రలకు నేపథ్య గానం ఆయనదే. ఎస్వీరంగారావు, రేలంగి, రమణారెడ్డి లాంటి నాయకేతర నటుల నటనలతో ఆయన గొంతు మమేకం అయింది. మాధవపెద్దిది సుస్వరం. వివాహ భోజనంబు' అని తినుబండారాల గురించి వర్ణించినా, సరదా సరదా సిగరెట్టు' అని ధూమపానం అనర్థాల గురించి హెచ్చరించినా, అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి వాపోయినా, భళి భళి భళి భళి' దేవా అంటూ తత్వాన్ని బోధించినా, భలేచాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తెలిపినా, మాధవపెద్ది సుస్పష్ట స్వరం చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని మాధవపెద్ది గురించి గాన గంధర్వుడు ఎస్పీ. బాలు అంటుండే వారు.



మాధవపెద్ది సత్యం (మార్చి 11, 1922 – డిసెంబర్ 18, 2000) తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు. ఈయన తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7,000 పైగా పాటలు పాడి ప్రసిద్ధి చెందాడు. సత్యం 1922, మార్చి 11 న బాపట్ల సమీపాన బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య, సుందరమ్మ దంపతులకు జన్మించాడు. వృత్తిరీత్యా నటుడైన సత్యం చిన్నతనములో ఎనిమిదేళ్ల వయసునుండి రంగస్థల నాటకాలలో నటించేవాడు. తెలుగు రంగ స్థలముపై మల్లాది సూర్య నారాయణ నాటక బృందములో సభ్యునిగా హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుని పాత్రను అద్భుతము పోషిస్తూ పేరు తెచ్చుకున్నాడు. ఆయన ప్రతిభను గుర్తించిన చక్రపాణి మాధవపెద్దిని తనతోపాటు మద్రాసు తీసుకువెళ్లి, తను నాగిరెడ్డితో కలిసి అప్పడే కొత్తగా స్థాపించబడిన విజయా పిక్చర్స్ పతాకము కింద నిర్మిస్తున్న షావుకారు చిత్రములో నటించే అవకాశము కలుగ జేశాడు. ఈయన తొలిసారిగా వెండితెరపై హిందీ, తమిళ ద్విభాషాచిత్రం రామదాసులో కనిపించాడు. ఆ సినిమాకు రెండు భాషల్లోనూ తన పాత్రర పాటలు తనే స్వయంగా పాడాడు. మాధవపెద్ది సత్యం షావుకారు సినిమాతో తెలుగు సినిమా రంగములో అడుగు పెట్టాడు. ఈ సినిమాలో సత్యం ఒక గుడ్డివాని పాత్రపోషించి ఆ పాత్రకు ఉన్న మూడు పాటలు పాడాడు. కొన్ని తెలుగు చిత్రాలలో నటించినా మాధవపెద్ది సత్యం ప్రధానంగా గాయకుడే. ఆయన ఆనాటి ప్రసిద్ధ సంగీత దర్శకులైన సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు తదితరు లందరితో పనిచేశాడు. ఎస్వీ రంగారావు, రేలంగి వెంకట రామయ్య పాటలన్నీ దాదాపు ఆయనే పాడాడు. పౌరాణిక చిత్రాలలో పద్యాలు పాడటములో పేరెన్నిక గన్నాడు. ముఖ్యంగా పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం జోడి కలిసి పాడిన పాటలు తెలుగు వారి నోళ్ళలో ఇప్పటికి నానుతూనే ఉన్నాయి. 75 ఏళ్ళ వయసులో కూడా కృష్ణవంశీ తీసిన సింధూరం సినిమాలో సంకురాతిరి పండగొచ్చెరో పాటపాడి పలువురి ప్రశంసలందు కున్నాడు.

ఇలా ఎందరో నటులకు ఆయన కంఠం అమరి పోయింది. రంగస్థల అనుభవం ఆయన్ని తీర్చిదిద్దింది.
పద్యం ఆయన గళంలో వయ్యారాలు ఒలికించు కుంది.
పాట ఆయన గొంతులో ఒదిగి పోయింది. పాడుతున్నది పాత్రలేమో, పాత్రదారులేమో అనిపించేలా పాత్రలలో ఆయన స్వరం పరకాయ ప్రవేశం చేస్తుంది. ఆయన పద్యంలో భావం తొణికిస లాడుతుంది. ఆయన పాటలో రాగం అలవోకగా అమరి పోతుంది. ఆయన కంఠంలో గాంభీర్యం నాట్య మాడుతుంది. ఆయన కంఠంలో హాస్యం గిలిగింతలు పెడుతుంది.
తనకు వచ్చిన గౌరవ పురస్కారాలను ఎప్పుడూ ప్రదర్శించు కోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. రైలులో సెకండ్ క్లాసులోనే ప్రయాణించే వాడు. మాయాబజార్‌లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించలేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు .
ఆయన 78 సంవత్సరాల వయసులో 2000, డిసెంబర్ 18న చెన్నైలో అస్వస్థతతో మరణించాడు. ఆయన కుమారుడు, కూచిపూడి నృత్య కోవిదుడు మాధవపెద్ది మూర్తి తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం ' మాధవపెద్ది సత్యం అవార్డు, మాధవపెద్ది ప్రభావతి అవార్డును ' నెలకొల్పారు. ఆ పురస్కారం అందుకొన్న వారిలో ఎం. ఎస్. విశ్వనాథన్, పి. బి. శ్రీనివాస్ లాంటి ప్రముఖులున్నారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్....**
**9440595494**


# టెక్నాలజీతో సుస్థిరాభివృద్ధి సుసాధ్యం

## 'జాతీయ సాంకేతికత దినోత్సవం" సందర్భంగా..

**11 మే 1988 రోజున రాజస్థాన్ సమీప పోక్రాన్ వద్ద భారత్ నిర్వహించిన "ఆపరేషన్ శక్తి" పరీక్షల ద్వారా భారత్ తన తొలి అణు పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. నాటి ప్రధానమంత్రి ఏ. బి. వాజ్‌పాయ్ నాయకత్వంలో మాజీ రాష్ట్రపతి ఏ పి జె అబ్దుల్ కలాం శాస్త్రవేత్తల బృందం విజయవంతంగా న్యూక్లియర్ పవర్‌ను ప్రదర్శించడంతో అణుశక్తిగల దేశాల జాబితాలో భారత్ సగర్వంగా చేరినట్లు అయ్యింది. ఈ అద్భుత పరీక్ష ద్వారా భారత శాస్త్రసాంకేతిక ప్రగతి ప్రపంచానికి అర్థం అయ్యింది. ఈ మహత్తర సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 11 మే రోజున దేశవ్యాప్తంగా "జాతీయ సాంకేతికత దినోత్సవం" లేదా "నేషనల్ టెక్నాలజీ డే" పాటిస్తున్నాం. నేడు భారత శాస్త్ర సాంకేతికతలతో పాటు నిరంతర ఆవిష్కరణలు దేశ సమగ్రాభివృద్ధికి పునాదులు వేస్తూనే ప్రపంచ పవర్ హౌజ్‌గా కూడా కీర్తించబడుతున్నది.**

జాతీయ టెక్నాలజీ దినోత్సవం–2026:
జాతీయ సాంకేతికత దినోత్సవం వేదికగా భారతీయ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఇంజనీర్ల సేవలను కొనియాడడం, వారిని సముచితంగా గౌరవించడం, యువత/విద్యార్థిలోకాన్ని శాస్త్ర సాంకేతికశాస్త్రాల వైపు ఆకర్షించడం జరుగుతున్నది. నేటి ఏఐ యుగంలో సృజన, ఆవిష్కరణలకు పెద్ద పీట వేయడంతో మానవ జీవనశైలి సరళతరం కావడం, సుస్థిరాభివృద్ధి సుసాధ్యం కావడం జరుగుతున్నది. భారతీయ నూతన స్టార్టప్‌లకు ఊతం ఇవ్వడం, ఇన్నొవేషన్‌కు అధిక ప్రోత్సాహం ఇవ్వడం, ఔత్సాహిక టెక్నోక్రాట్లకు చేయూత అందించడం, స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) రంగాలకు నేటి యువశక్తినా ఆకర్షించడం నిరంతరం కొనసాగాలి. జాతీయ టెక్నాలజీ దినోత్సవ వేదికగా భారతీయ శాస్త్ర సాంకేతికత కేంద్రంగా సెమినార్లు, కార్యశాలలు, టెక్ ప్రదర్శనలు, భారతీయ శాస్త్రసాంకేతిక ప్రగతిని స్పష్టం చేసే డాక్యుమెంటరీల ప్రదర్శనలు, శాస్త్ర ప్రగతి నివేదికలు, వైజ్ఞానికశాస్త్ర పోటీలు, పర్యవరణహిత టెక్నాలజీల వినియోగాలు, డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహిస్తారు.

జాతీయ టెక్నాలజీ దినోత్సవం–2026 ఇతివృత్తం:
2025 జాతీయ టెక్నాలజీ దినోత్సవ ఇతివృత్తంగా "భాద్యతాయుతమైన ఆవిష్కరణలతో సమ్మిళిత అభివృద్ధి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. దేశ ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్న శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు సముచిత గౌరవం ఇవ్వడం మన కనీస కర్తవ్యం. వాతావరణ మార్పులు, వనరుల కొరతలు, పర్యావరణ విధ్వంసం లాంటి ప్రధాన సవాళ్లను



పరిష్కరించడానికి సృజనశీల ఆవిష్కరణలు కొనసాగాలి. భారత ప్రభుత్వ ఆత్మ నిర్భరతను సుసాధ్యం చేయడానికి అవసరమైన కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను రూపొందించడం నిరంతరం కొనసాగుతున్నది. అంతరిక్ష ఆవిష్కరణలు, డిజిటల్ మౌళిక వనరులు, బయోటెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ లాంటి అంశాల్లో భవిష్యత్తు లక్ష్యాలను అధిగమించడం జరగాలి. రేపటి భారతం ఇన్నొవేషన్, క్రియేటివిటీ, రీసర్చ్‌లను ప్రోత్సహిస్తూనే అంతరిక్షం, ఆరోగ్యం, డిజిటల్ వనరుల పరిజ్ఞానం పెరుగుతుందని గుర్తుంచుకోవాలి.

సైన్స్ సూత్రీకరణలతో టెక్నాలజీ అనువర్తనాలు జనిస్తాయి. సైన్యడస్ లేకుండా టెక్నాలజీ లేదు, కాని టెక్నాలజీ లేకుండా సైన్స్ మనగలుగుతుంది. సైన్స్‌లోని ప్రతి ఆవిష్కరణ మానవాళి సరళ జీవనశైలికి ఏదో ఒక విధంగా ఉపయోగపడాలి. సైన్స్ అండ్ టెక్నాలజీలతో తరాల మధ్య పెద్ద అగాధాలు ఏర్పడుతున్నాయి. నేటి ఆవిష్కరణ రేపటికి అవిట్‌డేట్ అవుతున్నది. నేటి టెక్నాలజీని ఒడిసి పడితేనే అప్‌డేట్ అయినట్లు గౌరవిస్తున్నారు. నేటి యువత శాస్త్రసాంకేతికతల్లో అప్‌డేట్ కాకపోతే అవుట్‌డేట్ అయినట్లు అవమానకర విషయంగా భావించాలి. టెక్నాలజీ వాడని నేటి మానవుడు ఆది మానవుడిగా పరిగనించబడుతున్నాడు. భారతాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడానికి నేటి యువత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) రంగాల్లో తమ సత్తాను చాచుకోవాలి.

**- డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



## షరతుల బంధనాలు

ఆడదాన్ని సంతోష పెట్టడానికి..
మగాడు చేతి నిండా సంపాదిస్తాడు
మగాడి సహాయం లేకుండా..
స్వతంత్రంగా జీవించడానికి..
ఆడది తన సంపాదన్ని వాడుతోంది
ఆలుమగలు దంపతులు కావడం లేదు !

పక్క పక్కనే ఉంటున్నా..
కలవలేక పోతున్నారు
కష్టసుఖాల్ని పంచుకోలేక పోతున్నారు
ఒకే గూట్లో బతుకుతున్నా..
సోల్‌మేట్స్‌లా కాకుండా..
రూమ్‌మేట్స్‌లా గడుపుతున్నారు !

రూమ్‌మేట్స్ మధ్య వాణిజ్య స్నేహాలు
సోల్‌మేట్స్ నడుమ బేషరతు బంధాలు
మనుషులు కలిస్తే అవసర లెక్కలు
మనసులు ఏకమైతే త్యాగాల రెక్కలు
ఆలుమగలు సంపాదిస్తున్నా..
వేరు చేస్తున్న కోరికల చిట్టాలు !

నాటి చిట్టి చిట్టి ముచ్చట్లు..
బోలెడంత సంతోషాన్ని ఇచ్చేవి
నేడు ముచ్చట్ల చప్పట్లు పోయి..
వాదనల యుద్ధాలు జరుగుతున్నాయి
నేటి సుదీర్ఘ మాటల తూటాలు..
షరతుల బంధాల్ని పేల్చేస్తున్నాయి !

తొలినాళ్లలో తిండి ఆస్వాదించాం
నేటి యాంత్రిక జీవనయానంలో..
తిండిని మింగేస్తూ సాగుతున్నాం
నాటి గంజీ, గట్కలే పరమాన్నాలు
నేడు జూమోటో చెత్త మేతలు
దినమంతా పరుగుల బతుకులు
కలిసి జీవించటానికే లేవు క్షణాలు !

**మధుపాళీ**
**9949700037**

## తల్లిగా మారిన రోజు నుంచి..

తల్లిగా మారిన రోజు నుంచి నా జీవితంలోని ప్రతి రోజూ ఒక కొత్త అర్థాన్ని సంతరించుకుంది. మదర్స్ డే అనేది ఒక ప్రత్యేకమైన తేదీ మాత్రమే కాదు.. ప్రతి తల్లి హృదయంలో ప్రతిరోజూ జరిగే ఓ భావోద్వేగ పండుగ. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు, పిల్లల పెంపకం . ఇవన్నీ కలిసిన నా ప్రయాణంలో అలసట కంటే ఎక్కువ ఆనందాన్నే ఇచ్చేయి. ఎందుకంటే మాతృత్వం అనేది కేవలం బాధ్యత కాదు, అది మనసును పరిపూర్ణం చేసే వరం.

ఈ తరం యువతలో కొందరు పిల్లలు వద్దనుకోవడం చూస్తుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. పిల్లలతో వచ్చే కష్టం కన్నా, వారు మన జీవితంలో నింపే ప్రేమ, నవ్వులు, జ్ఞాపకాలు ఎంతో గొప్పవి. అయితే కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రుల మనసును గాయపరచడం చూసినప్పుడు బాధ కలుగుతుంది. అయినప్పటికీ, ప్రేమతో పెంచిన పిల్లలు చివరికి మన జీవితానికి అర్థాన్ని ఇస్తారనే నమ్మకం ఉంది. "చాయమ్మ" అని పిలుస్తూ నా చుట్టూ తిరిగే మనవలు, మనవరాళ్లు వీరందరూ నా జీవితానికి వెలుగులు. వారి నవ్వులు నాకు కొత్త ఉత్సాహం ఇస్తాయి. వారి చిన్నచిన్న మాటల్లో, ఆటల్లో, అల్లర్లలో ఆనందం దాగి ఉంటుంది.

ప్రతి తల్లికి నేను చెప్పేది ఒక్కటే ..పిల్లలతో గడిపే సమయాన్ని ఎప్పుడూ వాయిదా వేయవద్దు. వారితో ఆడండి, నవ్వండి, మాట్లాడండి. మీరు ఇచ్చే సమయం, ప్రేమ, ఆదరణే వారి భవిష్యత్తును నిర్మిస్తుంది. ప్రతి అమ్మమ్మ, నానమ్మ మనవలు, మనవరాళ్లతో గడిపే ప్రతి క్షణం దేవుడు ఇచ్చిన వరం. వారితో కలిసి నవ్వండి, కథలు చెప్పండి, చిన్నపిల్లల్లా మళ్లీ జీవించండి. అప్పుడు వయస్సు కేవలం ఒక సంఖ్యగా మారిపోతుంది. చివరికి మనతో మిగిలేది సంపాదించిన ధనం కాదు, కలిసి గడిపిన అందమైన జ్ఞాపకాలే.



**- చాయా రతన్,**
**రిటైర్డ్ ఐఎఎస్ అధికారి**

# అసమాన నృత్య కళాకారిణి మృణాళిని

ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మృణాళినీ సారాభాయ్ పేరు శాస్త్రీయ నృత్య రంగంలో ఎరుగని వారు అరుదు. శాంతినికేతన్లో గురు రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర విద్యాభ్యాసం చేసిన మృణాళిని భరత నాట్యం, మోహినీ యాట్టం, కథాకళి నాట్య రీతులలో శిక్షణ పొందారు. నాట్యకారిణిగానే కాదు, కవయిత్రిగా, రచయితగా, నృత్య దర్శకురాలిగా ఆమె ఖ్యాతి పొందారు.

మృణాళినికి భరతనాట్యం పంచ ప్రాణం. నాట్యమే సర్వస్వం. నాట్యం కోసం జీవితంలో అసలు పెళ్లే చేసుకో కూడదని అనుకున్నారు. ఆమె కుటుంబానికి సన్నిహితులైన పరమాణు శాస్త్రవేత్త హోమీ జహంగీర్ భాభానే ... మరో శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌ని మృణాళినికి పరిచయం చేశారు. విక్రమ్ ఆమెను కలిసిన తర్వాత ఆమె కూడా మారారు. తర్వాత... మృణాళిని విక్రమ్ పెళ్లి చేసుకున్నారు.

మృణాళిని సారాభాయ్ (1918 మే 11 – 2016 జనవరి 20) భారతీయ సాంప్రదాయ నృత్య కళాకారిణి, నృత్య దర్శకురాలు, నృత్య గురువు. ఆమె "దర్పణ అకాడమీ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్"కు వ్యవస్థాపకురాలు. అహ్మదాబాదు లోని ఈ సంస్థలో నృత్య రీతులు, నాటకాలు, సంగీతం, తోలుబొమ్మపాటలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆమె 18,000 మంది శిష్యులకు భరత నాట్యం, కథాకళి లలో శిక్షణ ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు.
మృణాళిని కేరళ లోని మాజీ పార్లమెంట్ సభ్యులు, సామాజిక కార్యకర్త అయిన అమ్ము స్వామినాథన్ కుమార్తె. ఆమె బాల్యం స్విట్జర్లాండ్ లో గడిచింది. ఆమె "డాల్‌క్రోజ్" పాఠశాలలో తొలి పాఠాలుగా పశ్చిమాది నృత్య భంగిమలను నేర్చుకున్నారు...ఆమె శాంతి నికేతన్‌లో రవీంద్ర నాథ్ ఠాగూర్ మార్గదర్శకత్వంలో విద్యాభ్యాసం చేశారు. అక్కడ జీవిత యదార్థాలను గ్రహించే అవకాశాలు కలిగాయి. తర్వాత ఆమె కొంతకాలం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళి... అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా/డ్రామాటిక్ ఆర్ట్స్ లో చేరారు. తర్వాత భారత దేశానికి వచ్చి ఆమె దక్షిణాది సాంప్రదాయక నృత్యం అయిన భరతనాట్యాన్ని "మీనాక్షి సుందరంపిళ్ళై" ద్వారా, కథాకళి నృత్యాన్ని "తకఘి కుంచు కురూప్" ద్వారా శిక్షణ పొందారు.

మృణాళిని 1948 లో దర్పణ అనే సంస్థను స్థాపించారు. ఒక సంవత్సరం తరువాత పారిస్ లో "థియేటర్ నేషనల్ డి చైల్లోట్" లో ప్రదర్శన ఇచ్చారు.

మృణాళిని సుమారు మూడు వందలకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఆమె అనేక నవలలు, కవితలు, నాటకాలు, కథలు పిల్లల కోసం రచించారు. ఆమె గుజరాత్ రాష్ట్ర హాండీక్రాఫ్ట్స్ అండ్ హాండ్ లూం డెవలప్ మెంట్ సంస్థకు చైర్‌పర్సన్ గా,



గాంధీ ఆశయాల ప్రోత్సాహం కోసం యేర్పడిన, సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కు ఆమె ఒక ట్రస్టీగా కూడా ఉన్నారు.

మృణాళిని సారాభాయ్ 1965లో పద్మశ్రీ, 1992 లో భారతదేశ విశిష్ట పురస్కారం పద్మభూషణ అవార్డును అందుకున్నారు. 1997 లో యు.కె లోని న్యూయాచ్ కు చెందిన అంగిలియా విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా, మెడల్ అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1990 లో పారిస్ లోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీలో నామినేట్ చేయ బడ్డారు. 1994 లో న్యూఢిల్లీ లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మెక్సికో ప్రభుత్వం నుండి బంగారు పతకాన్ని పొందారు. సాంప్రదాయిక నృత్య రంగంలో "మృణాళినీ సారాభాయ్ అవార్డ్ ఫర్ క్లాసికల్ ఎక్సలెన్స్" అవార్డును ప్రకటించింది. 2013లో కేరళ ప్రభుత్వ వార్షిక పురస్కారమైన నిషాగంధి పురస్కారానికి ఆమె మొదటి గ్రహీత.
మృణాళిని కుటుంబీకులు పేరు మోసిన వారు కావడం విశేషం.

ఆమె తండ్రి డా.స్వామినాథన్ మద్రాసు హైకోర్టులో పేరు పొందిన బారిష్టరు. మద్రాసు లా కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అమె తల్లి అమ్ము స్వామినాథన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మాజీ ఎం.పి. మృణాళిని సోదరి డా. లక్ష్మీ సెహగల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సీ రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా ఉండేది. ఆమె సోదరుడు "గోవింద స్వామినాథన్" మద్రాసు హైకోర్టులో పేరుమోసిన న్యాయవాది. ఆయన మద్రాసు రాష్ట్ర (తమిళనాడు) కు అటార్నీ జనరల్ బాధ్యతలు కూడా నిర్వహించారు.

మృణాళిని భర్త భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్ కాగా, భారతీయ అంతరిక్ష కార్యక్రమ పిత విక్రం సారాభాయ్ తన భార్యకు తన కెరీర్ ను పెంపొందించు కునేందుకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. వారికి ఒక కుమారుడు కార్తికేయ సారాభాయ్, ఒక కుమార్తె మల్లికా సారాభాయ్ ఉన్నారు. కుమార్తె మల్లిక కూడా నృత్య కళాకారిణియే. మృణాళిని అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2016, జనవరి 21న మరణించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# అమ్మోరికా... అగమ్యగోచరికా!

ఒకప్పుడు 'అమెరికా' అంటే ఆశ, అవకాశం, అభివృద్ధి. నేడు భారతీయ యువత నోట 'అమ్మో... అమెరికా!' అనే నిట్టూర్పు వినిపిస్తోంది. కలల నేల ఇప్పుడు అనిశ్చితి, ఆర్థిక భారాలు, కఠిన నిబంధనలు, అవమానకర వ్యాఖ్యలతో భయపెట్టే ప్రదేశంగా మారుతోంది. 'అమెరికా వెళ్లాలి' అనే లక్ష్యం, 'వెళ్లాలా వద్దా?' అనే ప్రశ్నగా మారింది. అంతేకాదు, ఈ మార్పు యువత ఆలోచనను కేవలం అమెరికాకే పరిమితం చేయకుండా, కెనడా, జర్మనీ, యుకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వైపు కూడా మళ్లిస్తోంది. గతంలో అమెరికా స్వప్నం – మంచి చదువు, ఉన్నత ఉద్యోగం, అధిక ఆదాయం – భారతీయ మధ్యతరగతి యువతకు పరమావధిగా ఉండేది. కానీ 2025–26 నాటికి, ట్రంప్ పాలనలో 'అమెరికన్ ఉద్యోగాలు అమెరికన్లకే' నినాదంతో వలస విధానాలు కఠినతరమయ్యాయి. హెచ్–1బి వీసాపై లక్ష డాలర్ల ఫీజు ప్రతిపాదన, వేతన ఆధారిత ఎంపిక, మూడేళ్ల నిలిపివేత వంటి చర్యలు, ఇందులో 70 శాతం పైగా భారతీయులే ఉండటంతో, ప్రత్యక్షంగా వారి భవిష్యత్తును దెబ్బతీశాయి. లాటరీ విధానంలోని ఆశ కూడా అంతరించింది. ఈ నేపథ్యంలో 'అమెరికా ఒక్కటే మార్గం' అనే భావన కూలిపోతోంది. ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత వివాదాస్పదం చేశాయి. భారతీయ మహిళలు ప్రసవ పర్యాటకం ద్వారా పౌరసత్వం పొందుతున్నారనే ఆరోపణ, భారత్‌ను అవమానకర పదాలతో ప్రస్తావించడం, ఇది రాజకీయ ప్రకటనకు మించి, భారతీయుల గౌరవంపై దాడిగా మారింది. భారత ప్రభుత్వం కూడా దీన్ని అనుచితంగా ఖండించడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది. యువత ఇప్పుడు 'మనం ఆహ్వానితులమా, అనుమానితులమా?' అనే సందేహంతో జీవిస్తోంది.

దీని ప్రభావం గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 2025లో అమెరికా విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల నమోదు 45 శాతం తగ్గింది. వీసా మంజూరు గణనీయంగా తగ్గగా, వేలాది మంది నిపుణులు అనిశ్చితి కారణంగా స్వదేశానికి తిరిగి వస్తున్నారు. మరోవైపు, అమెరికా సంస్థలే తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాలను భారత్‌లో విస్తరిస్తున్నాయి. అంటే భారతీయ మేధస్సు అవసరం తగ్గలేదు. కానీ దాని భౌగోళిక కేంద్రం మారుతోంది. ఇతర దేశాలు కూడా సులభ వలస విధానాలు, నైపుణ్య వీసాలతో భారతీయ ప్రతిభను ఆకర్షిస్తున్నాయి.

ఇది భారత్‌కు ఒక ద్వంద్వ పరిస్థితి. ఒకవైపు, తిరిగి వచ్చే




ప్రతిభ, పెట్టుబడులు దేశానికి కొత్త బలం కావచ్చు. మరోవైపు, విదేశీ పంపకాలు, అంతర్జాతీయ అనుభవ మార్పిడి తగ్గే ప్రమాదం ఉంది. అయినా, కీలకమైన మార్పు ఇదే -- యువత గమ్యాన్ని మార్చుకుంటోంది, గమనాన్ని ఆపడం లేదు.

ప్రపంచం మారుతోంది. వలసల దిశ మారుతోంది. 'అమెరికా స్వప్నం'ను కాపాడే ప్రయత్నంలోనే అమెరికా, ఆ స్వప్నాన్ని ప్రపంచ యువతకు దూరం చేస్తోంది. అలాంటప్పుడు, భారతీయ యువతకు ఇది ఒక స్పష్టమైన హెచ్చరిక. అమెరికా ఇక ఏకైక భద్రమైన మార్గం కాదు. కానీ ఇది అదే సమయంలో గొప్ప అవకాశం కూడా. 'అమ్మోరికా'గా మారుతున్న ఆ నేల స్థానంలో, 'మన భారత్' గట్టి ప్రత్యామ్నాయంగా నిలవాలి. దీనికి ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి -- దేశంలోనే ప్రపంచ స్థాయి పరిశోధన, ఉద్యోగాలు, ఆవిష్కరణలను నిర్మించాలి. అప్పుడే వలసల అనిశ్చితిని దేశీయ శక్తిగా మార్చగలం. ప్రపంచం వైపు చూపులు మళ్లుతున్న ఈ సమయంలో, భారత్ స్వప్నం మరింత బలంగా, మరింత గౌరవంగా అవతరించాల్సిన సమయం ఇది.

**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,**
**సీనియర్ జర్నలిస్ట్,**
**సెల్: 9010128884)**



# ఇంట్లోనే మ్యాంగో ఐస్ క్రీమ్..



## కేవలం 4 పదార్థాలతో అదిరిపోయే రుచి!

వేసవి కాలం రాగానే అందరూ మామిడి పండ్ల కోసం ఆశగా ఎదురుచూస్తుంటారు. కేవలం మామిడి పండ్లను తినడమే కాకుండా, వాటితో తయారు చేసిన క్రీమీ ఐస్ క్రీమ్‌ను ఆస్వాదించడం ఒక ప్రత్యేక అనుభూతి. మార్కెట్లో లభించే ఐస్ క్రీమ్‌లలో కృత్రిమ రంగులు అధిక చక్కెర ఉంటాయి. కానీ, మీరు ఇంట్లోనే తయారు చేసుకుంటే రుచితో పాటు ఆరోగ్యానికి కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదు.



### తయారీ విధానం

ముందుగా మామిడి తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయండి. నీళ్లు కలపకుండా మిక్సీలో వేసి మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోండి. ఒక పెద్ద గిన్నెలో చల్లని ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్ తీసుకోవాలి. ఎలక్ట్రిక్ బీటర్ లేదా విస్క్‌తో క్రీమ్ చిక్కబడే వరకు బాగా గిలకొట్టాలి. క్రీమ్ ఎంత చల్లగా ఉంటే ఐస్ క్రీమ్ అంత నునుపుగా వస్తుంది. ఇప్పుడు ఈ విప్డ్ క్రీమ్‌లో కండెన్స్‌డ్ మిల్క్, యాలకుల పొడి లేదా వెనిలా ఎసెన్స్ సిద్ధం చేసుకున్న మామిడి గుజ్జు వేయాలి. క్రీమ్‌లోని గాలి పోకుండా నెమ్మదిగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని పాత్రలో పోసి, పైన మామిడి ముక్కలను చల్లాలి. పాత్రను ప్లాస్టిక్ ర్యాప్‌తో గాలి చొరబడకుండా మూసి, డీప్ ఫ్రీజర్‌లో 7 నుండి 8 గంటల పాటు లేదా రాత్రంతా ఉంచాలి. ఈ మామిడి ఐస్ క్రీమ్ సహజమైన పండ్లతో చేసినందున పిల్లలకు కూడా ఇది మంచి ఆప్షన్. కృత్రిమ రంగులు ప్రిజర్వేటివ్‌లు లేకపోవడం దీని ప్రత్యేకత.



### కావలసిన పదార్థాలు

తాజా మామిడి గుజ్జు: 2 కప్పులు
ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్: 1 కప్పు
చిక్కటి పాలు (కండెన్స్‌డ్ మిల్క్): 1/2 కప్పు
యాలకుల పొడి లేదా వెనిలా ఎసెన్స్: చిటికెడు
అలంకరణ కోసం: చిన్న మామిడి ముక్కలు

# అరేబియా తీరాన ఆధ్యాత్మిక ఆలయం సోమనాథ్



**అరేబియా సముద్ర అలలతో నిత్యం మ్రోగిపోతూ, భారతీయ ఆధ్యాత్మిక చైతన్యానికి శాశ్వత చిహ్నంగా నిలిచిన గుజరాత్ రాష్ట్రంలోని ప్రభాస్ పటణం సోమనాథ్ క్షేత్రం దేశ చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆద్య జ్యోతిర్లింగంగా పూజలందుకుంటున్న సోమనాథ్ ఆలయం కేవలం భక్తి క్షేత్రం మాత్రమే కాదు; అది భారతీయుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి, నాగరికత సహనశక్తికి ప్రతీక. ఎన్నో విదేశీ దండయాత్రలు, దోపిడీలు, విధ్వంసాలు ఎదురైనా తిరిగి తిరిగి లేచి నిలబడిన ఈ దేవాలయం భారతదేశ చరిత్రలో "అజేయ ఆధ్యాత్మిక శక్తి"గా గుర్తింపు పొందింది.**

స్వాతంత్ర్యానంతరం ఈ ఆలయ పునర్నిర్మాణాన్ని దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించడం, ఇప్పుడు 75 సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఆలయాన్ని సందర్శించడం మరోసారి సోమనాథ్‌ను జాతీయ చర్చాంశంగా మార్చింది.

సోమనాథ్ ఆలయ చరిత్ర పురాణ కాలం నుంచి ప్రారంభమవుతుంది. చంద్రుడు తన అత్తమామ అయిన దక్ష ప్రజాపతి శాపంతో కాంతిని కోల్పోయినప్పుడు ఈ క్షేత్రంలో పరమశివుని ఆరాధించి శాప విమోచనం పొందాడని శివ పురాణం, స్కాంద పురాణం, భాగవతం వంటి గ్రంథాలు వివరిస్తున్నాయి. "సోముడు" అంటే చంద్రుడు, "నాథుడు" అంటే పరమేశ్వరుడు. అందుకే ఈ క్షేత్రానికి "సోమనాథ్" అనే పేరు వచ్చింది. హిందూ సంప్రదాయంలో ఈ క్షేత్రానికి అత్యంత పవిత్ర స్థానం ఉంది. చరిత్రకారుల అంచనాల ప్రకారం సోమనాథ్ ఆలయం తొలి నిర్మాణం ప్రాచీన భారత కాలానికే చెందుతుంది. అనంతరం మౌర్యులు, చాళుక్యులు, ప్రతిహారులు, సోలంకీ రాజులు ఆలయాన్ని విస్తరించి మహత్తర శిల్పకళా సంపదగా తీర్చిదిద్దారు.

సోమనాథ్ ఆలయం చరిత్రను పరిశీలిస్తే అది విదేశీ దండయాత్రలకు ప్రతిఘటించిన భారతీయ ఆత్మగౌరవ చరిత్రగా కనిపిస్తుంది. క్రీస్తు శకం 1025లో గజనీ మహ్మద్ భారీ సైన్యంతో సోమనాథ్‌పై దాడి చేసి ఆలయాన్ని ధ్వంసం చేశాడు. చరిత్రకారుల వివరాల ప్రకారం ఆలయంలో అపారమైన బంగారం, వెండి, రత్నాలు, వజ్రాలు నిల్వ ఉండేవి. గజనీ దాదాపు వేలాది ఒంటెలపై సంపదను తరలించాడని పాత వృత్తాంతాలు పేర్కొంటాయి. అయితే ఆలయం పూర్తిగా నశించలేదు. కొద్ది కాలానికే భక్తులు, స్థానిక రాజులు మళ్లీ పునర్నిర్మాణం చేపట్టారు. తర్వాత అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాధిపతులు, మొఘల్ దండయాత్రలు, చివరకు ఔరంగజేబు కాలంలో కూడా ఆలయం విధ్వంసానికి గురైంది. అయినప్పటికీ ప్రతి సారి సోమనాథ్ తిరిగి నిలిచింది. ఇదే ఈ క్షేత్ర విశిష్టత.

స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో సోమనాథ్ పునర్నిర్మాణం ఒక మహత్తర ఘట్టంగా నిలిచింది. దేశ సమైక్యతకు శిల్పిగా పేరుపొందిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ 1947లో జూనాగఢ్ సంస్థానం భారతదేశంలో విలీనం అయిన తర్వాత సోమనాథ్‌ను సందర్శించారు. అప్పటికి ఆలయం శిథిలావస్థలో ఉండేది. ఆ దృశ్యాన్ని చూసిన పటేల్ "సోమనాథ్ పునర్నిర్మాణం భారత జాతీయ ఆత్మగౌరవానికి ప్రతీక కావాలి" అని



ప్రకటించారు. ప్రభుత్వ నిధులతో కాకుండా ప్రజల విరాళాలతో ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కేంద్ర మంత్రి కేఎం మున్షీ ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. జామ్‌నగర్ మహారాజా దిగ్విజయ్ సింగ్ తదితరులు కూడా ఆర్థిక, పరిపాలనా సహకారం అందించారు.

1951 మే 11న సోమనాథ్ ఆలయంలో జ్యోతిర్లింగ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ స్వయంగా హాజరై ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంఘటన స్వాతంత్ర్యానంతర భారతదేశంలో అత్యంత



చారిత్రక పరిణామంగా నిలిచింది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చరిత్రకారులు పేర్కొంటారు. లౌకికవాద దేశంలో రాష్ట్రపతి ఒక మతపరమైన కార్యక్రమంలో పాల్గొనడం సరికాదని ఆయన భావించినట్లు చెప్పబడింది. అయినప్పటికీ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. "సోమనాథ్ పునర్నిర్మాణం కేవలం దేవాలయ నిర్మాణం కాదు; విదేశీ దండయాత్రలతో దెబ్బతిన్న భారతీయ ఆత్మవిశ్వాస పునరుద్ధరణ" అని ఆయన చారిత్రక ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పటి భారతీయ సమాజంలో గొప్ప చైతన్యాన్ని కలిగించాయి.

ప్రస్తుతం ఉన్న సోమనాథ్ ఆలయం చాళుక్య శైలిలో అద్భుతంగా నిర్మించబడింది. ఆలయ శిఖరం సుమారు 155 అడుగుల ఎత్తులో నిలిచి దూరం నుంచే భక్తులను ఆకర్షిస్తుంది. శిఖరంపై ప్రతిష్ఠించిన కలశం బంగారు తేజస్సుతో మెరిసిపోతుంది. ఆలయ ధ్వజస్తంభం సుమారు 37 అడుగుల ఎత్తులో ఉంటుంది. సముద్రతీరాన నిలిచిన ఈ ఆలయం శిల్పకళా వైభవానికి, భారతీయ వాస్తు సంప్రదాయానికి అద్దం పడుతుంది. ఆలయ ప్రాంగణంలోని "బాణస్తంభం" ప్రత్యేక ప్రాధాన్యం పొందింది. ఈ స్తంభంపై "ఇక్కడి నుంచి దక్షిణ ధృవం వరకు మధ్యలో భూభాగం లేదు" అనే భావనతో సంస్కృత శాసనం చెక్కబడి ఉంది. భారతీయుల ప్రాచీన భౌగోళిక జ్ఞానానికి ఇది ఒక గొప్ప నిదర్శనంగా భావిస్తారు.

గత కొన్ని దశాబ్దాలుగా సోమనాథ్ క్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. మోదీ సోమనాథ్ ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో సముద్ర దర్శన్ మార్గం, విశాల యాత్రికుల వసతి గృహాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ సేవలు, మ్యూజియం, ప్రదర్శన గ్యాలరీలు, సాంస్కృతిక కేంద్రాలు ఏర్పాటు చేశారు. సముద్ర తీరాన్ని అభివృద్ధి చేస్తూ "సముద్ర దర్శన్ పథ్" నిర్మించడం వల్ల యాత్రికులకు ప్రత్యేక అనుభూతి కలుగుతోంది. రాత్రి వేళల్లో ఆలయంలో నిర్వహించే లైట్ అండ్ సౌండ్ ప్రదర్శనలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు సోమనాథ్‌ను సందర్శిస్తున్నారు. ముఖ్య పర్వదినాల్లో రోజుకు లక్ష మందికి పైగా భక్తులు దర్శనం చేసుకుంటున్నట్లు ట్రస్ట్ అంచనాలు చెబుతున్నాయి. రైల్వే, జాతీయ రహదారులు, సమీప విమానాశ్రయాల అభివృద్ధి వల్ల దేశ నలుమూలల నుంచి యాత్రికులు సులభంగా చేరుకుంటున్నారు. గిర్ అటవీ ప్రాంతం, ద్వారక, దియూ వంటి పర్యాటక ప్రాంతాలతో అనుసంధానం కారణంగా సోమనాథ్ పర్యాటక కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందింది. హోటళ్లు, చిన్న వ్యాపారాలు, పూజా సామగ్రి విక్రయాలు, హస్తకళలు వంటి రంగాల్లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సోమనాథ్ ఆలయాన్ని సందర్శించడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. స్వాతంత్ర్యానంతరం 75 సంవత్సరాల క్రితం డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించిన ఆధ్యాత్మిక–సాంస్కృతిక పునరుజ్జీవన యాత్రను గుర్తు చేస్తూ మోదీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమనాథ్ భారతీయుల ఆధ్యాత్మిక శక్తికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. మోదీ పాలనలో కాశీ విశ్వనాథ్ ధామ్, మహాకాళ్ కారిడార్, అయోధ్య రామమందిరం వంటి ఆధ్యాత్మిక ప్రాజెక్టులకు ప్రాధాన్యం లభించిన నేపథ్యంలో సోమనాథ్ అభివృద్ధి కూడా అదే దిశలో కొనసాగుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సోమనాథ్ ఆలయం చుట్టూ రాజకీయ, సాంస్కృతిక, లౌకికవాద చర్చలు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. కొందరి దృష్టిలో ఇది భారతీయ నాగరికత పునరుద్ధరణకు చిహ్నం కాగా, మరికొందరి అభిప్రాయం ప్రకారం మత చిహ్నాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే సాధారణ భక్తుని దృష్టిలో సోమనాథ్ విశ్వాసానికి నిలయం. ఎన్నిసార్లు కూల్చివేసినా మళ్లీ మళ్లీ లేచి నిలబడిన ఈ ఆలయం భారతదేశ ఆత్మను ప్రతిబింబిస్తుంది.

సోమనాథ్ చరిత్రను పరిశీలిస్తే అది కేవలం ఒక దేవాలయ చరిత్ర కాదు; భారతీయ సమాజ సహనశక్తి, సాంస్కృతిక చైతన్యం, జాతీయ ఆత్మగౌరవం, ఆధ్యాత్మిక విశ్వాసం కలిసి రూపుదిద్దుకున్న మహాగాథ. గజనీ దాడుల నుంచి స్వాతంత్ర్యానంతర పునర్నిర్మాణం వరకు, రాజేంద్ర ప్రసాద్ ప్రతిష్ఠ కార్యక్రమం నుంచి నరేంద్ర మోదీ ఆధునిక అభివృద్ధి కార్యక్రమాల వరకు సోమనాథ్ యాత్ర భారతదేశ మార్పు, మానసిక బలానికి ప్రతిబింబంగా నిలిచింది. శతాబ్దాల కాలాన్ని దాటి ఇంకా అదే ఔన్నత్యంతో నిలిచిన సోమనాథ్ ఆలయం భారతీయ నాగరికతకు చిరస్మరణీయ చిహ్నంగా యుగయుగాల పాటు వెలుగొందుతూనే ఉంటుంది.

– రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# తట్టె ఇడ్లీ.. తయారు చేసుకోండిలా...



**కావలసిన పదార్థాలు:**
బియ్యం – రెండు కప్పులు, మినపప్పు – కప్పు, అటుకులు – ముప్పావు కప్పు, నూనె, ఉప్పు – తగినంత.

**తట్టె ఇడ్లీ.. తయారు చేసుకోండిలా...**
కావలసిన పదార్థాలు: బియ్యం – రెండు కప్పులు, మినపప్పు – కప్పు, అటుకులు – ముప్పావు కప్పు, నూనె, ఉప్పు – తగినంత.

**తయారుచేసే విధానం:**
బియ్యం, మినపప్పును వేరు వేరుగా అయిదు గంటల పాటు నానబెట్టి రుబ్బుకోవాలి. ఇందులో అటుకులని కూడా కలపాలి. ఓ రాత్రంతా అలా విడిచిపెట్టాలి. ఉదయం తగినంత ఉప్పు కలపాలి. ఇడ్లీ స్టాండ్ లోని పెద్ద పెద్ద ప్లేట్లకు నూనెపూసి పిండి వేసి ఆవిరి మీద ఉడికిస్తే తట్టె ఇడ్లీ తయారు.



# వడాపావ్ అమ్మితే నెలకు..!



మనం సాధారణంగా రోడ్డు పక్కన బండి మీద వడాపావ్ అమ్మే వారిని చూసి, వారు కేవలం రోజు గడవడానికి మాత్రమే సంపాదిస్తారని అనుకుంటాం. కానీ, అసలు విషయం తెలిస్తే మీరు షాక్ అవుతారు.

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక కథనం ప్రకారం, ముంబై వంటి నగరాల్లో ఒక సాధారణ వడాపావ్ విక్రేత సంపాదన పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఎంబీఏ గ్రాడ్యుయేట్ల జీతం కంటే ఎక్కువగా ఉంది. సంపాదన లెక్కలు ఇలా ఉన్నాయి: రోజువారీ అమ్మకాలు: ఒక రద్దీగా ఉండే ప్రాంతంలో సగటున రోజుకు 600 నుండి 1000 వరకు వడాపావ్‌లు అమ్ముడవుతాయి. ఒక్కో వడాపావ్ ధర రూ. 15 నుండి రూ. 20 వరకు ఉంటుంది. రోజువారీ ఆదాయంను పరిశీలిస్తే సగటున ఒక రోజుకు రూ. 9,000 నుండి రూ. 10,000 వరకు గల్లా పెట్టెలోకి వస్తుంది. నెలవారీ లాభం గురించి చూస్తే.. ముడి సరుకులు, గ్యాస్, కార్మికుల ఖర్చులు అన్నీ పోను, ఒక విజయవంతమైన వడాపావ్ విక్రేత నెలకు రూ. 2 లక్షల నుండి రూ. 2.5 లక్షల వరకు నికర లాభం సంపాదిస్తున్నారు. అంటే ఏడాదికి వీరి ఆదాయం దాదాపు రూ. 24 లక్షల పైమాటే. కష్టపడే తత్వం, రుచి,సరైన లోకేషన్ ఉంటే చిన్న వ్యాపారమే అయినా అది కార్పొరేట్ ఉద్యోగాల కంటే మిన్న అని రూనిపిస్తోంది ఈ వ్యాపారం.

వడా పావ్‌తో పాటు ఉల్లిపాయ కూర, పాలకూర కూర వంటి ఇతర రకాల వంటకాలను కూడా అమ్మితే, వడా పావ్ అమ్మేవారి ఆదాయం మరింత పెరుగుతుంది. ఈ విధంగా, రోజుకు 400 నుండి 500 వడా పావ్‌లు అమ్మే వ్యక్తి 5 వేల రూపాయల ఆదాయం




## 10 వారాల్లో ?లక్ష కోట్ల నష్టం..

# త్వరలో 'పెట్రో' షాక్ తప్పదా?

**దిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన ఇంధన ధరలతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు చవిచూస్తున్నాయి. మూడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600-1700 కోట్ల మేర నష్టపోతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. గడిచిన 10 వారాల్లో రూ.1 లక్ష కోట్ల మేర నష్టాలు చవిచూసినట్లు తెలిపాయి. భారీ నష్టాల నేపథ్యంలో త్వరలోనే పెట్రో షాక్ తప్పదని తెలుస్తోంది.**

ఇరాన్–అమెరికా ఉద్రిక్తతలు మొదలై, అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ పాత ధరకే విక్రయిస్తున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విక్రయాలపై మూడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600–1700 కోట్లు చొప్పున గడిచిన పది వారాల్లో రూ.1 లక్ష కోట్లు నష్టపోయి నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో క్రూడాయిల్ కొనుగోలుకు మూల ధనం సమకూర్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని, మూలధన వ్యయాలకు సంబంధించిన కాలవ్యవధులను సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని చమురు రంగ నిపుణులు విశ్లేషించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనేది రాజకీయ




అంశమని, దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని మరో వ్యక్తి తెలిపారు. చమురు ధరల పెంపు అనివార్యమని, అయితే ఎంత మొత్తం? ఎప్పుడు చేపడతారనేది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. జపాన్, యూకే వంటి దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను 30 శాతం పెంచాయని గుర్తుచేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకం ప్రభుత్వం తగ్గించదన్నారు. దీనివల్ల ప్రభుత్వం కూడా రూ.14వేల కోట్ల ఆదాయం కోల్పోతోందన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



వాణిజ్య సిలిండర్ ధరలను ఇండియన్ చమురు కంపెనీలు మారుస్తుంటాయి. ఈ క్రమంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా గ్యాస్ సిలిండర్ ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. ఇక ఈ మధ్య కాలంలో యుద్ధ వాతావరణంతో అక్కడక్కడ గ్యాస్ కొరత ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కొరత ఏర్పడిన ప్రాంతాల్లో సిలిండర్ ధరలు అమాంతం ఆకాశాన్నంటడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఈ క్రమంలోనే ఇవాళ (మే 10) రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**హైదరాబాద్ : రూ. 965.00**
**వరంగల్ : రూ.984.00**
**విశాఖపట్నం : రూ. 921.00**
**విజయవాడ : రూ. 937.50**
**గుంటూరు : రూ. 937.50**

## ఎస్‌బీఐ లాభం రూ.19,684 కోట్లు

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2025–26 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికాని (క్యూ4)కి స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.19,684 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంకు ఆర్జించిన రూ.18,643 కోట్ల కన్నా ఇది 6 శాతం ఎక్కువ. మార్చి త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.1,43,876 కోట్ల నుంచి రూ.1,40,412 కోట్లకు తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంకు రూ.1,23,098 కోట్ల వడ్డీ ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం




ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన వడ్డీ ఆదాయం రూ.1,19,666 కోట్లుగా ఉంది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 1.82 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.47 శాతం నుంచి 0.39 శాతానికి చేరాయి. ఇక కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4లో ఎస్‌బీఐ నికర లాభం రూ.19,600.46 కోట్ల నుంచి రూ.19,648.87 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.1,79,562 కోట్ల నుంచి రూ.1,81,079 కోట్లకు పెరిగింది. కాగా మొత్తం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 13 శాతం వృద్ధితో రూ.80,032 కోట్ల స్టాండ్‌ఎలోన్ నికర లాభాన్ని బ్యాంకు ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.70,901 కోట్లుగా ఉంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.17.35 డివిడెండ్‌ను బ్యాంకు బోర్డు ప్రకటించింది.

## 2026-27లో రూ.7,500 కోట్ల పెట్టుబడులు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో రూ.7,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు హ్యుండయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) ప్రకటించింది. ఈ పెట్టుబడుల్లో 40–50 శాతం మొత్తాలను కొత్త ఉత్పత్తుల అభివృద్ధి కోసం కేటాయించనుండగా మిగిలిన మొత్తాలను చెన్నై, పుణె ప్లాంట్ల సామర్థ్య విస్తరణకు వినియోగించనున్నట్లు సంస్థ ఎండీ, సీఈఓ తరుణ్ గార్గ్ వెల్లడించారు. 2030 నాటికి కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాన్ని 11.4 లక్షల యూనిట్లకు చేర్చాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా దేశీయ ఆటోమొబైల్ మార్కెట్లో మళ్లీ రెండో స్థానాన్ని చేజిక్కించుకోవటం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాదిలో మార్కెట్లోకి రెండు కొత్త ఎస్‌యూవీలను కూడా ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. వీటిలో ఒకటి ఎలక్ట్రిక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ కాగా.. మరొకటి పెట్రోల్/డీజిల్ (ఐసీఈ) ఆధారిత ఎస్‌యూవీగా ఉండనుందన్నారు.

## కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన యండమూరి గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**కుత్బుల్లాపూర్, మే 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ను షాపూర్ నగర్‌లోని వారి నివాసంలో గాజులరామారం డివిజన్ యండమూరి గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుమన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న మౌలిక వసతుల కల్పనపై కృషి చేస్తానని, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వారి కార్యవర్గ సభ్యులందరూ కాలనీ అభివృద్ధికి తోడ్పాటు అందించి కాలిని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి, వారి కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలియపరిచారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న అంతర్గత డ్రైనేజీ, వీధి దీపాల సమస్య, అంతర్గత సీసీ రోడ్లు వంటి సమస్యలను వారు శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారు సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుమన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లేష్, రాజేందర్, అంజిరెడ్డి, భీమారెడ్డి, వై ఎఫ్ సి ఏ అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

## 4 లేబర్ కోడ్స్ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి

**కీలుకానీ లక్ష్మణ్**



**కుత్బుల్లాపూర్, మే 10 (నినాదం) :** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ శుభం హోటల్ భవన నిర్మాణ కార్మికుల సంఘం అడ్డా వద్ద నాలుగు లేబర్ కోడ్స్ అమలు జీవో కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధాన్ని మొదలుపెట్టిందని ఈ లేబర్ కోడ్స్ కార్మికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల కాడ కార్మిక హక్కులను తాకట్టు పెట్టిందని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కనీస వేతనం సామాజిక భద్రత వంటి హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కార్మిక వర్గంపై సాగుతున్న ఈ పాశవిక దాడిని సహించేది లేదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఏ రోజూ పాలకులు, కార్మిక హక్కులను ఉచితంగా ఇవ్వలేదనీ, లాటీలు, తూటాలను ఎదిరించి పోరాటాల ద్వారానే మనం హక్కులను సాధించుకున్నాం. పెద్ద పెద్ద పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల అండతో ఏర్పడిన ఈ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపే వరకు కార్మిక వర్గం ఐక్యతతో పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాషా, శ్రీశైలం, యాదవ రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

## ప్రధాని సభకు భారీగా తరలివెళ్ళిన కార్యకర్తలు



**వికారాబాద్, మే 10(నినాదం):** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆదివారం హైద్రాబాద్ నగరానికి రానున్న నేపథ్యంలో జిల్లా నుండి బి జే పీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలల్లో జిల్లాలోని ఆయా గ్రామాలనుండి నాయకులు, కార్యకర్తలు, తరలి వెళ్ళారు. ఇదివరకు ఏనాడు లేని విధంగా గ్రామాల్లో కమలం పార్టీ రోజు రోజుకు పుంజుకుంటున్న తరుణంలో ప్రాధాని సభకు అధిక సంఖ్యలో తరలి వెళ్ళడం రాజకీయాల్లో చర్చనియాంశమైయింది. గతంతో పోల్చుకుంటే కమలం బలం పుంజుకుంటోందని పార్టీ నాయకులు బలంగా నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో మిశ్రమ స్పందన లభిస్తోందని భావిస్తున్నారు.

# విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

**సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు**






**పటాన్చెరు, మే 10(నినాదం):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుఢ్యత కోసం విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న పివి నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10 జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కరాటే పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు. చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతోపాటు.. ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిమానాలను వివరించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు. కరాటే పోటీల నిర్వహణ కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ 5 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు.

## రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారింది

**కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేసే పరిస్థితి వచ్చింది**

**ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం**

**మాజీ మంత్రి హరీష్ రావు**




**వెల్దుర్తి, చేగుంట/మే10 (నినాదం):** చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో, నేరుగా మాట్లాడి. వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో నెలకొన్న పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని మండిపడ్డారు. కర్నాల్‌పల్లి కొనుగోలు కేంద్రం ప్రారంభించి 25 రోజులు పూర్తయినా ఇప్పటివరకు కేవలం రెండు లారీలు మాత్రమే రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. "15 రోజులకు ఒక లారీ వస్తే రైతులు తమ ధాన్యాన్ని ఎప్పుడు అమ్ముకోవాలి? వారి పరిస్థితి ఏంటి?" అని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, మళ్లీ రైతులు ఎండబెట్టి సిద్ధం చేసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో ఇదే పరిస్థితి కనిపిస్తోందని, రైతుల కళ్లలో కన్నీళ్లు మాత్రమే కనిపిస్తున్నాయని, ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై తీవ్ర విమర్శలు చేసిన హరీష్ రావు... "ఇప్పటి వరకు ఒక్కసారి అయినా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేశారా? ఒక్క మంత్రి అయినా జిల్లాల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారా?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికొదిలేసిందని, ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమైందని విమర్శించారు. గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నామని, ఇంత ఘోరమైన పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, కాంగ్రెస్ నాయకులే కలెక్టరేట్ ముందు ధర్నాలు చేసే పరిస్థితి, రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

## ఆగని బస్సులు

**నామమాత్రానికే మండల కేంద్రం**

**ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు**

**పట్టించుకోని అధికారులు**



**వెల్దుర్తి, మాసాయిపేట/మే10 (నినాదం):** మండల కేంద్రంగా మాసాయిపేట ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా ఇంతవరకు బస్టాండ్ కాదు కదా బస్టాప్ కు కూడా దిక్కులేదు. 44వ జాతీయ రహదారిపై ఉన్న మాసాయిపేట గతంలో వెల్దుర్తి మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది . మాసాయిపేట మండలం కేంద్రంగా ఏర్పడింది. గతంలో మండలంలో ఏ చిన్న పని కావాలన్నా, మాసాయిపేట నుండి, సుమారు 15 కిలోమీటర్ల ,దూరంలో ఉన్న, వెల్దుర్తి కి వెళ్ళాల్సి వచ్చేది. దీంతో మాసాయిపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులను, ఎదుర్కొనేవారు. మండల కేంద్రం ఏర్పడటంతో, ప్రజలకు దూర భారం తగ్గింది. కానీ మండలంలో ఇంకా కొన్ని సమస్యలు, మిగిలే ఉన్నాయి. అందులో పోలీస్ స్టేషన్, బస్టాండ్ లు లేకపోవడం, పెద్ద సమస్యగా మారాయి. 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న మాసాయిపేట జాతీయ రహదారి, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, పోతుంది. ప్రతిరోజూ వేల సంఖ్యలో వాహనాలు, వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఈ మార్గం గుండానే పయనిస్తాయి. కానీ 90 శాతం బస్సులకు స్టాప్ లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతరం పనుల మీద తూప్రాన్ కు, వెళ్లడం జరుగుతే రామంతపురం నుండి టికెట్ ఇవ్వడం జరుగుతుంది. ఎందుకు ఇలా ఇస్తున్నారని కండక్టర్ లు నిలదీస్తే, ఇక్కడ స్టాప్ లేదు పక్క గ్రామంలో స్టాప్ ఉంది కాబట్టి టికెట్ ఇవ్వడం జరుగుతుంది అని అనడం తో ప్రయాణికులకు, కండక్టర్, కొద్దిసేపు సమస్య అంతరాయం కలుగుతుంది. అంటే మాసాయిపేట మండలానికి స్టాప్ కూడా లేకపోవడం ఎంతవరకు ఆలోచించాల్సిన విషయం టికెట్ తీసుకోవడం కూడా పక్క గ్రామం లో ఎక్కినట్టుగా టికెట్ ఇస్తున్నారు మన గ్రామంలో ఎంతోమంది పెద్ద స్థాయిలో ఉన్నారు. కేవలం ఒక స్టాప్ కూడా సంపాదించుకోలేదని ఒకరికొకరు సిగ్గుగా భావిస్తున్నామని, అనుకుంటారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ ఏర్పాటు చేయాలని, మండలం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలి

**పేట్ బషీరాబాద్ పీఎస్ ఎదుట**

**బిఆర్ఎస్ మహిళా నాయకుల ధర్నా**



**కుత్బుల్లాపూర్, మే 10 (నినాదం):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కుత్బుల్లా పూర్ బిఆర్ఎస్ మహిళా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మహిళా నాయ కురాల్లు మాట్లాడుతూ బేటీ బచావో, బేటి పడావో అంటూ మహిళల భద్రతపై పెద్ద ఎత్తున మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు ఈ ఘటనపై స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. పోక్సో వంటి అత్యంత తీవ్రమైన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నిష్పక్షపాత దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి, దర్యాప్తుకు సహకరించాలని మహిళా నాయకులు కోరారు. అధికార హోదాను ఉపయోగించి కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగకూడదని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాధితురాలికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని, కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలుగా అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండ కూడదని, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాల్లు పావని, స్రవంతి, సునీత, శైలజ, మంజుల, అరుణారెడ్డి, ఇంద్రారెడ్డి, పద్మ, ఫర్జానా, హేమలత, లావణ్య, పార్వతి, కరీమా, కవిత పాల్గొన్నారు.

# గరీబోళ్ల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం





**పేదలకు గృహవసతి కల్పించడమే ప్రజాపాలన ముఖ్య ఆశయం**

**జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్**

**జవహర్ నగర్, మే 10 (నినాదం):** గరీబోళ్ల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేదలకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడమే ప్రజా పాలన ముఖ్య ఆశయమని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ హాజరై సుమారు 5 లక్షల వ్యయంతో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ళను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదల జీవితాలు ఇలాంటి సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతాయని ప్రభుత్వం అందించే సాయం సరైన విధంగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ తమకు సహకరించిన నాయకులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, జమాల్పూర్ నవీన్ కుమార్, మాధవరెడ్డి, రఫీ, శ్రీరాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# 16 నుండి 'సెంట్రింగ్ పని బంద్' నిరవధిక ధర్నా

- **వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే**



**కుత్బుల్లాపూర్, మే 10 (నినాదం) :** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన "సెంట్రింగ్ పని బంద్" నిరవధిక ధర్నా కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే ను కోరారు. ఈ సందర్భంగా సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కు జై దుర్గా భవాని సెంట్రింగ్ కార్ ట్రాక్టర్స్ అసోసియేషన్ - చింతల్, కుత్బుల్లాపూర్ జోన్, జై దుర్గ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, దుండిగల్ జోన్, షాపూర్ నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, షాపూర్ నగర్ జోన్ ల ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికుల సమస్యలను విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని, సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 16 నుంచి తలపెట్టిన "సెంట్రింగ్ బంద్" నిరవధిక ధర్నాకు మా మద్దతు ఉంటుందన్నారు. భవన నిర్మాణ ప్రాంతాలలో తరచూ సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనానికి గురవుతుంది, అట్టి మెటీరియల్ను దొంగిలించిన వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. మా సెంట్రింగ్ మెటీరియల్ ను దొంగతనంగా కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైల్వే మెటీరియల్ మాదిరిగానే సెంట్రింగ్ మెటీరియల్ కు ప్రత్యేక గుర్తింపునిస్తూ దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు కార్మికులు పడి మరణించినప్పుడు వెంటనే సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయకుండా ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపిన తర్వాతే చర్యలు తీసుకోవాలి. సెంట్రింగ్ పద్ధతిలో ఉన్న వారికి ప్రతి అమావాస్యకు చట్టబద్ధంగా సెలవుదినంగా ప్రకటించి కార్మిక, పోలీస్ శాఖల సహకారం అందేలా చూడాలి. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి. చాంద్ పాషా, జై దుర్గ భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, షాపూర్ నగర్ జోన్ అధ్యక్షులు మక్బుల్, దుండిగల్ జోన్ అధ్యక్షులు సదానందం, ఉపాధ్యక్షులు సిహెచ్. సత్తిబాబు, కుంటి వీరేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, కోశాధికారి ఎం.వీరేష్, శివశంకర్, శ్రీనివాస్, వివిధ వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు బి యాదగిరి, పి వీరేష్, వి రాకేష్, ఈశ్వర్, కృష్ణ, మహంకాళి రావు, సత్యనారాయణ, ముని, సంజీవులు వెంకటేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలలో పాల్గొన్న చిలుక ఉపేందర్ రెడ్డి



**ఎల్ బినగర్, నినాదం:** ఆధ్యాత్మిక చింతలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీ పార్కులో భారతీయ కళ సమితి తాండవ కృష్ణ ఆధ్వర్యంలో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 259వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మాతృమూర్తి దినోత్సవం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ కళ సమితి వారు ఉపేందర్ రెడ్డితో పాటు వారి మాతృమూర్తి చిలుక హైమవతి లకు జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. తదనంతరం ఉపేందర్ రెడ్డి సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంశీ, లలిత, పూర్ణిమ, సైదా రావ్, రవి కిరణ్, భరద్వాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ప్రభంజనం సభకు ముఖ్య అతిథిగా కృష్ణయ్య


**బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ**



**ఎల్ బినగర్, నినాదం:** మే 24న ఎల్బీనగర్‌లో జరగనున్న బీసీ ప్రభంజనం సభకు ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరు అవుతారని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సత్యనారాయణ ఆర్ కృష్ణయ్య ను ఆయన నివాసంలో కలిసి బీసీ ప్రభంజనం సభకు రావాలని ఆహ్వానించారు. బీసీ ఉద్యమానికి మద్దతుగా జరుగుతున్న బీసీ ప్రభంజనం సభకు ఖచ్చితంగా హాజరు అవుతానని ఆర్ కృష్ణయ్య హామీ ఇచ్చారు అని ఆయన తెలిపారు. ప్రధానంగా వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ ప్రభంజనం నిర్వహించడం జరుగుతుంది అని సత్యనారాయణ వివరించారు. గతంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలు అందించిన ఆర్ కృష్ణయ్య ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు హాజరు కావడం బీసీ ఉద్యమానికి స్ఫూర్తిని ఇస్తుంది అని సత్యనారాయణ వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగే బీసీ ప్రభంజనం సభకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నేతలు హాజరు కానున్నారు అని ఆయన అన్నారు. మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభ బీసీ ఉద్యమంలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలు ఏకం కావాలి అని ఎస్సీ ఎస్టీ బీసీ జెఏసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న విజ్ఞప్తి చేశారు. మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు ఎస్సీ ఎస్టీ బీసీ జెఏసి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. రాజ్యాధికారానికి దూరంగా ఉన్న దళితులు గిరిజనులు బీసీలు ఏకం కావాలి అని ఆయన అభిప్రాయపడ్డారు.

# సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం హేయమైన చర్య

- **2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలి**
- **టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి**



**దుబ్బాక మే 10 (నినాదం):** 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింప చేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి తీవ్రంగా ఖండించారు. 01-09-2004కు ముందు నోటిఫికేషన్ జారీ చేసి, అనంతరం నియామకాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకొని అమలు చేస్తోందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 ఉత్తర్వుల ప్రకారం పలు రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేశాయని, తెలంగాణ ప్రభుత్వం కూడా అదే దిశగా ముందడుగు వేయాలని కోరారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క టీజీఈజేఏసీ నాయకత్వంలో జరిగిన చర్చల్లో ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఈ ప్రయోజనాన్ని కల్పించిన ప్రభుత్వం, సామాన్య ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులకు మాత్రం నిరాకరించడం న్యాయసమ్మతం కాదన్నారు. హైకోర్టు మూడు నెలల్లో అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్-ఎల్పి దాఖలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా మే 5న జేఏసీ నాయకులతో చర్చలు జరిపి హామీ ఇచ్చిన రోజే రిట్ పిటిషన్ దాఖలు కావడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులను, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల సానుభూతితో వ్యవహరించి, హైకోర్టు ఆదేశాల మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని టిపిటిఎఫ్ తరఫున డిమాండ్ చేశారు.

## కాగ్నిచాంప్ స్కాలర్‌షిప్‌లో
# పారమిత విద్యార్థినికి రాష్ట్ర ప్రథమ స్థానం

**లక్ష రూపాయల నగదు బహుమతి అందుకున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని**



**కరీంనగర్, ఏప్రిల్ 11(నినాదం):** యువన కాగ్నిటివ్ స్కోర్ ఏఐ నిర్వహించిన "కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్‌షిప్--తెలంగాణ 2026" పోటీలో కరీంనగర్‌కు చెందిన పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థిని ఎం. యువన రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది.రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి 1,12,733 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీని రెండు దశల్లో నిర్వహించారు. తొలి దశలో ప్రతిభ కనబరిచిన 100 మందిని తుది దశకు ఎంపిక చేయగా, మధ్యస్థాయి విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న యువన అగ్రస్థానంలో నిలిచింది.హైదరాబాద్‌లోని టి హబ్‌లో నిర్వహించిన పురస్కార కార్యక్రమంలో ముఖ్య అతిథి జయప్రకాశ్ నారాయణ్ చేతుల మీదుగా యువనకు రూ.1 లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థుల ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా తమ సంస్థ అందిస్తున్న శిక్షణకు ఈ విజయం నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు యువనను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేష్, అనుకర్ రావు, వినోద్ రావు, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపల్ గోపికృష్ణ పరాంకుశం, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, ఉపాధ్యాయ బృందం పాల్గొని యువనను ప్రత్యేకంగా అభినందించారు.

# బదిలీపై వెళ్తున్న ఎస్సై సతీష్‌కు ఘనంగా వీడ్కోలు




**జమ్మికుంట, మే 10 (నినాదం) :** జమ్మికుంట పట్టణ ఎస్సై గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై సతీష్ ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికిన జమ్మికుంట యువకులు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ పట్టణ ప్రజల అభిమానాన్ని అతి తక్కువ సమయంలోనే చూరగొన్న ఎస్సై సతీష్ బదిలీపై సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి ఎస్ హెచ్ ఓ గా బదిలీపై వెళ్తుండగా ఆదివారం జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో ఎస్సై సతీష్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్ఐ సతీష్ జమ్మికుంటకు వచ్చిన అతి తక్కువ సమయంలోనే నిజాయితీగా నిబద్ధతతో విధులు నిర్వహించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని ఇలాంటి అధికారి బదిలీపై వెళ్లడం బాధాకరమైనప్పటికీ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పదని ఆయన ఎక్కడకు వెళ్లిన ఇదే ఉత్సాహంతో విధులు నిర్వహిస్తూ ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమం లో జమ్మికుంట యువత పాతకాల ప్రవీణ్, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, రాజకుమార్, అంబాల అరుణ్, నాగరాజు ,వెంకటేష్, ప్రకాష్ రాజ్, సంతోష్, అభినయ్ తదితర యువత పాల్గొన్నారు.

# నిజాయితీకి నిలువెత్తు రూపం 'జువ్వాడి' రత్నాకర్

**ఆలయాల్లో దూప, దీప, నైవేద్య పథకం రూప శిల్పి...జువ్వాడి**

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నేత**






బుగ్గారం, మే 10(నినాదం ).. రత్నాకర్ రావు మారుమూల పల్లెల్లో కరెంట్ దీపాలు వెలిగించి చీకట్లను పారాదోలారు.వ్యవసాయ రంగం అంటే ఆయనకు పంచా ప్రాణాలు అందుకే గోదావరి తలాపున ఉన్నా నీరు సద్వినియో గం కాలేకపోతుందని భావించి గోదావరి పరివాహక ప్రాంతంలో (లిఫ్ట్ )ఎత్తిపోతల పథ కంతో పంటలను సస్య శ్యామలం చేశారు. గుడులలో నిత్యం పూజలు, దీపం వెలుగాలని ప్రభుత్వంలో ఉండి దుప, దీప, నైవేద్యానికి అంకురార్పణ చేశారు. గ్రామాల్లో రోడ్లు, మురుకుకాలువల నిర్మాణా నికి ఆధ్యుడు ఆయనే.మారుమూల గ్రామాల్లో పిల్లలు చదువులకు దూరమవుతున్నారని భావించి బడులు నిర్మించి అందుకు పంతుళ్ళ నియామకం చేసి విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారు. నియోజకవర్గంలో రాజకీయ నాయకులకు క్రమశిక్షణతో కూడిన నాయకత్వన్ని అందించిన మహానేత జువ్వాడి రత్నాకర్ రావుది.ఆయన మరణించి 6 ఏళ్ళు అయినా ఆయన జ్ఞాపకాలు నేటికీ ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నాయి. బుగ్గారం నియోజకవర్గంలో రత్నాకర్ రావు కంటే ముందు ఎందరో ఎమ్మెల్యేలుగా పనిచేసినప్పటికీ జువ్వాడి హయాంలోనే బుగ్గారానికే ఒక గుర్తింపు తీసుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేబినెట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆ శాఖకే వన్నె తెచ్చారు.మారు మూల గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో పురాతన ఆలయాలు ఉండగా వాటికీ నిత్య పూజలు జరిగేవి కావు. ఆయన మంత్రి పదవీ చేపట్టి రాష్ట్రంలోని అన్ని ఆలయాలల్లో నిత్యం దూప, దీపం వెలిగించాలని కంకణం కట్టుకుని ఆచరణలో పెట్టిందే దూప, దీప నైవేద్య పథకం. రాజకీయాల్లో ఉన్న నాయకులు ప్రజల మనసులు గెలుచుకోవడం మరో గొప్ప విషయం. కానీ పదవులు ముగిసిపోయిన తర్వాత కూడా ప్రజల గుండెల్లో జీవించడం మాత్రం చాలా అరుదైన నాయకులకు మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటి అరుదైన ప్రజానాయకుల్లో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**నీతి, నిజాయితీకి ఆయనే ప్రతిరూపం....**

అప్పట్లో కొన్ని గ్రామాలు కరెంట్ లేక చీకట్లో నూనె దీపాల మధ్య మగ్గుతున్న పల్లెలకు ఆయనే చొరవ తీసుకుని కరెంట్ తో వెలుగులు నింపిన మహానుభావుడు రత్నాకర్ రావు.మే 10, 2026న ఆయన 6వ వర్ధంతి సందర్భంగా బుగ్గారం మండల కేంద్రంలో నివాళులర్పించేందుకు అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇది కేవలం ఒక వర్ధంతి కార్యక్రమం కాదు... విలువల రాజకీయాలకు ప్రజలు ఆయనకు అర్పించే నిలువెత్తు నివా ళి.బుగ్గారం ఎమ్మెల్యే తో పాటు కోరుట్ల, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జువ్వాడి రత్నాకర్ రావు అందించిన సేవలు ఇప్పటికీ ప్రజల జ్ఞాపకాలలో మరియు ఆ యన శిష్యుల్లో సజీవంగా నిలి చాయి. అధికారాన్ని ఆయుధంగా కాకుండా బాధ్యతగా భావించిన నేత ఆయన. తెల్లని ధోతి, లాల్చీ, ఆరున్నర అడుగుల ఆకారం, నిండైన చిరునవ్వు... ఇవన్నీ ఆయన బాహ్య రూపమే. కానీ ఆ రూపం వెనుక ఉన్నది అపారమైన మానవత్వం. అవినీతి, ఆక్రమాలు, రాజకీయ కక్షలు, దౌర్జన్యాలు తెలియని మనిషి ఆయన. ఎటువంటి బేషజాలు లేకుండా అందర్నీ కలుపుకొని పోయే వ్యక్తి త్వం ఆయనది. పేద -- ధనిక తారతమ్యం లేకుండా సహాయం చేయడం ఆయన సహజ స్వభా వం. అందుకే ఇప్పటికీ పెద్దలు ఆయన గురించి మాట్లాడేటప్పుడు ఒక మాట తప్పకుండా చెబు తారు.. జువ్వాడి అంటే నమ్మకం... జువ్వాడి అంటే మంచితనం.రాజకీయాల్లో ఎందరో నాయకులను నిరాడంబరతకు నిజమైన నిర్వచనం చెప్పాలంటే ముందుగా గుర్తొచ్చే పేరు జువ్వాడి రత్నాకర్ రావు మాత్రమే. అధికారంలో ఉన్నప్పుడు అహంకారం లేకుండా, సాధారణ మనిషిలా ప్రజలతో కలిసిమెలిసి ఉండే ఆయన వ్యక్తిత్వం అందరికి ఆదర్శం.ప్రజల సమస్యలు విన్నప్పుడు ఆయన కళ్లలో కనిపించే ఆత్మీయత, సహాయం చేసే సమయంలో ఎలాంటి ప్రచారం కోరుకోని తత్వం, రాజకీయాల్లో విలువలు ఎంత ముఖ్యమో తన జీవితం ద్వారా చూపించిన తీరు,ఇవన్నీ నేటికీ ప్రజల మనసులో చెరగని ముద్ర వేశాయి. నేటి రాజకీయాల్లో ప్రజలకు దగ్గర కావడానికి భారీ ప్రచారాలు అవసరమవుతున్నాయి.రత్నాకర్ రావు 1999 లో బుగ్గారం ఎమ్మెల్యే గా పోటీ చేసిన సమయం అత్యంత క్లిష్ట సమయం... రాజకీయ పార్టీ టిక్కెట్ ఇవ్వకున్నా స్వతంత్రుడిగా పోటీచేసి అఖండ విజయం సాధించారు. ఆయన ఎమ్మెల్యే గా పోటీ చేసిన సమయంలో ఖర్చు అయింది కేవలం 1200 రూపాయలే నని రత్నాకర్ రావు ఓ సందర్భశీలో చెప్పిన మాట ప్రజలకు నేటికీ గుర్తుండే ఉంటుంది. కానీ రత్నాకర్ రావు కాలంలో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడానికి ఆయనకు కావలసింది కేవలం నిజాయితీ,మానవత్వం మాత్రమే. ఇది కేవలం ఒక రాజకీయ కుటుంబం కథ కాదు... ప్రజలతో బంధాన్ని కొనసాగించిన ఒక విలువల వారసత్వం.రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావు. కానీ ప్రజల గుండెల్లో నిలిచే పేరు మాత్రం శాశ్వతం. జువ్వాడి రత్నాకర్ రావు అదే సంపాదించారు.నేడు రాజకీయాలు మారిపోయాయి.ప్రచారం పెరిగింది... కానీ ప్రజలకు దగ్గరైన నాయకత్వం తగ్గిపోయింది. ఇలాంటి సమయంలో జువ్వాడి రత్నాకర్ రావులాంటి నాయకుల జ్ఞాపకం ప్రజలకు మరింత విలువైనదిగా మారుతోంది.
ఎందుకంటే ఆయన రాజకీయాలు అధికారానికి కాదు.. ఆపన్నులకు అండగా ఉండటానికి చేశాడు.ఆయన భౌతికంగా దూరమైనా... ఆయన నడిచిన దారి ఇంకా ప్రజల మధ్యే ఉంది.ఆయన పేరు ఇంకా నమ్మకానికి చిరునామా.జువ్వాడి రత్నాకర్ రావు వంటి నాయకులు చరిత్ర పుటల్లో మాత్రమే కాదు... ప్రజల హృదయాల్లో శాశ్వతంగా జీవిస్తారు. వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటానికి నివాళులు అర్పించిన నేతలు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, లింగన్న, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రాజన్న మాజీ ఎంపీటీసీ రామ గౌడ్ తదితరులు పాల్గొన్నారు...

## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో
# సుందరకాండ జ్ఞానయజ్ఞం

**-శ్రీరాముని ఆదర్శాలు ఆచరించాలి: నరేందర్ రెడ్డి పిలుపు**



**కరీంనగర్, మే 10(నినాదం):** అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న సుందరకాండ జ్ఞానయజ్ఞం నాలుగో రోజు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా. వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.శ్రీరాముడు ధర్మానికి ప్రతీక, సత్యానికి నిర్వచనమని పేర్కొంటూ, వాల్మీకి మహర్షి రచించిన సుందరకాండను పఠించడం లేదా వినడం ద్వారా మానసిక, శారీరక శక్తులు పెరుగుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముని ఆదర్శంగా తీసుకుని ఆయన గుణాలను ఆచరిస్తే జీవితంలో విజయాలు సాధించవచ్చని సూచించారు.సీతాన్వేషణలో శ్రీరాముడు అనుసరించిన శాంతియుత విధానం సమాజానికి మార్గదర్శకమని, అలాంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవరు చుకుంటే భేదాభిప్రాయాలకు తావుండదని తెలిపారు.బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపెల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఈ ప్రవచనాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని దైనందిన జీవితంలో ఆచరిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు.కార్యక్రమంలో నిర్వహించిన భజనలు భక్తులను ఆధ్యాత్మిక భావోద్వేగాలకు లోనుచేశాయి.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**హుజురాబాద్,మే10(నినాదం):** హుజురాబాద్ స్థానిక వివిఎల్ఆర్ ఏసీ కన్వెన్షన్ హాల్లో అత్యంత ఘనంగా హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1995-97 ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు పుల్ల కరుణాకర్(ఇంటెలిజెన్స్ ఎస్పి), బోల్లం తిరుపతి(రియల్ ఎస్టేట్ వ్యాపారి), ఓరుగంటి తిరుపతి సీనియర్ విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతోపాటు భోదన చేసిన అధ్యాపకులు ఎస్ మనోహరా చారి, చంద్రమౌళి, శంకర్రావు, మహేందర్, నరసయ్య, తులసి దాస్, మొగులయ్య తో పాటు ప్రస్తుత కళాశాల అధ్యాపకుడు విద్యార్థులుపాల్గొన్నారు.

## చీకటి గుప్పిట్లో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు

**-వెలగని దీపాలతో పర్యాటకుల అవస్థలు**



**హుస్నాబాద్ మే 10(నినాదం);-** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట శరవేగంగా అభివృద్ధి చెందుతూ పర్యాటక కేంద్రంగా మారుతున్నప్పటికీ, ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులు సందర్శకులకు శాపంగా మారాయి. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం సాయంత్రం వేళల్లో పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చే పర్యాటకులకు ఇక్కడ చీకటి స్వాగతం పలుకుతోంది. కట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిధులు వెచ్చించి చెరువును సుందరీకరిస్తున్నామని చెబుతున్నా, కనీస సౌకర్యమైన వెలుతురు లేకపోవడం మున్సిపల్ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లైట్లు కూడా వెలుగునివ్వకపోవడంతో, సుదూర ప్రాంతాల నుండి ఎంతో ఆశతో వచ్చే సందర్శకులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కట్టపై నడవాలంటే పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువు నిండుగా నీరు ఉండటం, కట్టపై కనీస వెలుతురు లేకపోవడంతో చీకట్లో ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో పడిపోయే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు

# టీజేఎస్ పార్టీ 4వ ప్లీనరీ విజయవంతం చేయండి

**మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి**



**హుజురాబాద్, మే 2 (నినాదం) :** తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ 4వ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి పిలుపుని చ్చారు. ఆదివారం జమ్మికుంట పట్ట ణంలో ప్లీనరీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను టీజేఎస్ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షుడు పల్లెర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమె ఆవిష్కరించా రు.ఈ సందర్భంగా అరికిల్ల స్రవంతి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిత్యం పోరాడుతున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ రథసారధి,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి ప్రజల పక్షాన నిలుస్తోందని ఆమె గుర్తు చేశారు.ధన ప్రవాహంతో సంబంధం లేని నైతిక రాజకీయాల కోసం టీజేఎస్ కృషి చేస్తోందని స్రవంతి పేర్కొన్నారు. "కాళోజీ నారాయణ రావు, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయులు ఆశించిన తెలంగాణ పునర్నిర్మాణమే మా లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తూ, పారదర్శకమైన పాలన కోసం ప్రజలను చైత న్యపరుస్తున్నాం" అని ఆమె తెలి పారు.ఈ నెల 12వ తేదీన, హైదరా బాద్ లో నిర్వహించ తలపెట్టిన 4వ రాష్ట్ర ప్లీనరీ సమావేశానికి జమ్మి కుంట మండలం నుంచి కార్యకర్త లు, నాయకులు మరియు మేధా వులు అధిక సంఖ్యలో తరలిరావా లని జమ్మికుంట మండల అధ్యక్షుడు పల్లెర్ల శ్రీనివాస్ కోరారు. ఈ ప్లీనరీ ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అరికిల్ల భానుచందర్, పార్టీ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల ఐక్యతకు
# డిజిటల్ కుటుంబ సర్వే యాప్

**పోస్టర్ ఆవిష్కరణ...**

**యువత అభివృద్ధికి వేదికగా రూపకల్పన**



**కరీంనగర్, మే 10(నినాదం):** మున్నూరు కాపు సమాజం ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ కుటుంబ సర్వే యాప్ పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచమల్ల సందీప్ పటేల్, ప్రధాన కార్యదర్శి కోలా ప్రభాకర్ పటేల్, కోశాధికారి రాచమల్ల సంజీవ్ పటేల్, ఉపాధ్యక్షుడు మునిగాల అనిల్‌తో పాటు మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్పుల శ్రీనివాస్ పటేల్, సహాయ కార్యదర్శి రాచమల్ల సుగుణాకర్ పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలోని విద్యావంతులు, వైద్యులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సహకారం పెంపొందించేలా యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యువతకు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో మార్గనిర్దేశం చేయడంతో పాటు అత్యవసర సమయాల్లో సహాయ సహకారాలు అందించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా యాప్‌ను విస్తరించనున్నట్లు, పైలట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పెరుక శ్రీకాంత్, రాచమల్ల మనోహర్, మార్గం రాజిరెడ్డి, పోర్తి అనిల్, గోలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు




**120 బస్సులు, వందలాది వాహనాలతో హైదరాబాద్‌కు బయల్దేరిన నాయకులు, కార్యకర్తలు**

**కరీంనగర్, మే 10(నినాదం):** హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ జనాగ్రహ సభకు కరీంనగర్ జిల్లా నుంచి భారీ ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. సభకు బయల్దేరిన వాహన శ్రేణిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో సుమారు రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ రాష్ట్రానికి రావడం విశేషమన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని హోదాలో మోదీ తొలిసారిగా తెలంగాణకు రావడంతో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో జనాగ్రహ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో పార్టీ బలోపేతం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సభకు తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లా నుంచి 120 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు దాదాపు 500 కార్లలో నాయకులు, కార్యకర్తలు సభకు వెళ్లినట్లు వెల్లడించారు.ప్రధాని మోదీ సభతో తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందని, దక్షిణ భారతదేశంలో బీజేపీ విస్తరణకు తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని గంగాడి కృష్ణారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, పుప్పాల రఘు,అడిశెర్ల రాజు, పేరుక శ్రావణ్, భూముల అనిల్, పంజాల ప్రశాంత్, దేశెట్టి శ్రీనివాస్, ముత్తక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీని నెరవేరుస్తున్న కౌన్సిలర్ ఫిరోజ్

**-ఆడబిడ్డ పెళ్లికి ఐదువేల బహుమానం**

**-అభినందించిన వార్డు ప్రజలు**



**జమ్మికుంట, మే 10 (నినాదం) :** ఎన్నికల సమయంలో గెలుపు కోసం ఎంతో మంది నాయకులు ఎన్నో రకాలుగా హామీలు ఇస్తూ ప్రజల చేత ఓట్లు వేయించుకునే చరిత్ర అందరికీ ఉంటుంది. కానీ ఇచ్చిన మాటను నెరవేర్చడం అది కొందరికే సాధ్యమవుతుంది. అలాంటి నాయకుడు జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా కౌన్సిలర్ గా పోటీ చేసి గెలుపొందిన ఫిరోజ్ తాను గెలిస్తే కాలనీలోని ఏ ఆడబిడ్డపైంది జరిగిన 5000 రూపాయలు బహుమతి అందిస్తానని అప్పుడు మాట ఇచ్చాడు.ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం 7వ వార్డులోని ప్రతి పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి తన వంతు సహాయంగా 5016/- రూపాయలు ఇస్తాను అని మాటిచ్చిన కౌన్సిలర్ ఫెరోజ్ ఆదివారం వార్డులో జరిగిన పల్లె నర్సయ్య కుమార్తె సుమ వివాహంలో తన హామీ నిలబెట్టుకున్నారు. నూతన వధువరులను ఆశీర్వదించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ శుభాకార్యంలో స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ వైస్ చైర్మన్ జావీద్ కౌన్సిలర్లు,నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## రైతు సేవే లక్ష్యంగా పనిచేయాలి

**కొత్త మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఎమ్మెల్యే సత్యం అభినందనలు**



**కరీంనగర్, మే 10(నినాదం ):** కరీంనగర్ కొత్త మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఆకుల నరసన్నను డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన నరసన్న, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ఆశీస్సులు పొందారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆకుల నరసన్నను శాలువాతో సత్కరించి, కొత్త బాధ్యతల్లో జయప్రదంకావాలన్నారు.

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షునిగా రమేష్



**జమ్మికుంట, మే 10 (నినాదం):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘము అధ్యక్షునిగా గ్రామానికి చెందిన పింగిలి రమేష్ ఆదివారం ఎన్నికయ్యారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కోరపల్లి కి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా, ఈ నెల 10న జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా పింగిలి రమేష్, ఉపాధ్యక్షునిగా టంగుటూరి రామ్మోహన్ , సెక్రెటరీగా మద్దెర్ల రమేష్ డైరెక్టర్లుగా కొండవేనా పోషాలు, టంగుటూరి సంజీవ్, పింగిలి సంపత్, టంగుటూరి ఉమేష్, తీగల మల్లేష్, టంగుటూరి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఇరుకులాల సభ్యుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# హిందూ ఏక్తా యాత్రకు ఘనంగా ఏర్పాట్లు

**కరీంనగర్, మే 10(నినాదం )**హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ యాత్ర ఈసారి గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు కాషాయ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేపట్టాయి. హిందువుల ఐక్యత లక్ష్యంగా 16 ఏళ్ల క్రితం కొద్దిమందితో ప్రారంభమైన ఈ యాత్ర ప్రస్తుతం వేలాది మందిని ఆకర్షిస్తున్న భారీ ఆధ్యాత్మిక ర్యాలీగా మారింది. ఈసారి కూడా రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. యాత్రకు ఆహ్వానిస్తూ కాషాయ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి కరపత్రాలు పంచుతున్నారు. కాలనీల్లో గోడలపై స్వయంగా వాల్ పెయింటింగ్‌లు వేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా విస్తృత ప్రచారం కొనసాగుతోంది.ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ వైశ్య భవన్ నుంచి యాత్ర ప్రారంభం కానుంది. బండి సంజయ్ ప్రసంగం అనంతరం ర్యాలీ రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్, వన్‌టౌన్, వెంకటేశ్వర ఆలయం, అమరవీరుల స్థూపం, జయశంకర్ సర్కిల్ మార్గంగా తిరిగి వైశ్య భవన్‌కు చేరుకుంటుంది.వేసవి దృష్ట్యా యాత్రలో పాల్గొనే భక్తులకు మంచినీరు, మజ్జిగ, ఆహార పదార్థాల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, హిందుత్వ వాదులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధి నుంచి వచ్చే వారికి ప్రత్యేక రవాణా సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు. ర్యాలీలో భాగంగా వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కేరళ నుంచి హనుమంతుడి రూపాలు, హైదరాబాద్ నుంచి శ్రీరాముడి విగ్రహాలు, ఢిల్లీ నుంచి ప్రత్యేక వేషధారణలతో కళాకారులు పాల్గొననున్నారు. కేరళ డప్పు వాయిద్య బృందాలు, సిరిసిల్ల నుంచి ధ్వజాలతో వచ్చే బృందాలు యాత్రకు మరింత ఉత్సాహాన్ని తీసుకురానున్నాయి.రాజకీయాలకు అతీతంగా హిందువుల ఐక్యతే యాత్ర ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కుల సంఘాలు, ధార్మిక సంస్థలు, వృత్తి సంఘాలు, కళాకారులు, యాత్రకు సంఘీభావం ప్రకటించారు.

## ఫొటోల మార్ఫింగ్‌కు
# పాల్పడుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగి అరెస్ట్



**హుస్నాబాద్, మే 10(నినాదం):** సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ తోటి ఉద్యోగులు, మహిళల ఫోటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేస్తున్న విద్యుత్ శాఖ ఆర్టిసన్ ఉద్యోగిని హుస్నాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన శ్రీబద్రి మహేష్ (39) హుస్నాబాద్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆర్టిసన్‌గా పనిచేస్తు న్నాడు. ఇతడు తన కార్యాలయంలో పనిచేసే తోటి ఉద్యోగులతో పాటు బంధువుల వాట్సాప్ స్టేటస్‌లు, సోషల్ మీడియా అకౌంట్ల నుండి ఫోటోలను సేకరించి, ఫోటో ఎడిటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హుస్నాబాద్ విద్యుత్ శాఖ డి.ఈ. కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. డి.ఈ. ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ ఎస్.ఐ. పాకాల లక్ష్మారెడ్డి కేసు నమోదు చేయగా, సి.ఐ. కొంద్ర శ్రీను దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం నిందితుడిని హుస్నాబాద్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని సిద్దిపేట జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సి.ఐ. కొంద్ర శ్రీను మాట్లాడుతూ టెక్నాలజీని తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తూ ఇతరుల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# దేవాలయాలకు రాజకీయ రంగు పులమొద్దు

**స్వామికి నేను సేవకురాలిని మాత్రమే**

**తాము ఎప్పుడూ విచక్షణ రహితంగా ప్రవర్తించలేదు**

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి**



**భూపాలపల్లి. 10 మే (నినాదం):** దేవాలయాలపై రాజకీయాలు చేయడం తగదని దేవుళ్ళపై రాజకీయం చేసే వారికి పుట్టగతులు ఉండవని వరంగల్ జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ బిఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ. భూపాలపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణ అభివృద్ధి వేగంగా సాగుతున్న సమయంలో 2022లో అప్పటి ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి సంకల్పంతో మంజూరు నగర్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టమని తెలిపారు. తిరుపతికి వెళ్లలేని భక్తులకు కలియుగ దైవదర్శనం కల్పించాలని ఉద్దేశంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రజల సహకారం కోరామని,ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్మాణం పూర్తవాలని తాను 23 నెలల పాటు ఉడికిన ఆహారం కూడా తీసుకోకుండా దీక్ష చేపట్టినట్టు పేర్కొన్నారు. కేవలం 14 నెలల్లో నే ఆలయ నిర్మాణం పూర్తి చేసి స్వామివారిని ప్రతిష్ఠాపన నిర్వహించమని తెలిపారు. ఆలయ నిర్మాణం అనంతరం ముక్కు తీర్చుకునేందుకు భూపాలపల్లి నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేసినట్లు చెప్పారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత గెలిచినవారు ఆలయం పై రాజకీయాలు ప్రారంభించారని ఆరోపించారు ఆలయానికి సంబంధించి హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భక్తుల విరాళాల్లో ఒక్క రూపాయి కూడా తాము ముట్టలేదని కాంగ్రెస్ నాయకుడు అనిల్ లో శాశ్వత ధర్మకర్తగా నియమించామని తెలిపారు. నైతికంగా ఆలయ కమిటీని ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ దానికి నిరసన తెలిపేందుకే ఆలయానికి వెళ్ళామని స్పష్టం చేశారు. తాము ఎప్పుడూ విచక్షణ రహితంగా ప్రవర్తించలేదని, ఆలయం మాదని కూడా ఎప్పుడూ చెప్పలేదు అన్నారు. కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ వద్ద జరిగిన ఘటన బాధాకరమని మహిళా నాయకురాలిననే కనీస గౌరవం లేకుండా తీవ్ర వాదుల బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నారని హిస్టారితిన వ్యవహరిస్తారని విమర్శించిన స్వామికి నేను సేవకురాలిని మాత్రమే అని పేర్కొన్నారు. తాము ఎప్పుడూ తప్పు చేసి ఉంటే భగవంతుడి శిక్షకు సిద్ధమని అన్నారు ఆలయాలకు రాజకీయ రంగు పూలు వద్దని, అనేక దేవాలయాలు ధూప దీప నైవేద్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిత్య సౌకర్యాలు, పూజా కార్యక్రమాలతో మరో తిరుపతిని తలపించేలా అభివృద్ధి చెందిన ఆలయంపై కుట్రలు చేయడం బాధాకరమన్నారు. దేవుని సాక్షిగా జరిగిన ఈ ఘటనకు దైవమే సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పట్టణ నాయకులు వెంకటేశ్వర స్వామి భక్తులు, యువ నాయకులు మహిళా నాయకురాలు,గండ్ర దంపతులు అభిమానులు పాల్గొన్నారు.

## అమ్మ ఆశీస్సులు బిడ్డల వెంటే..

**అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



**హనుమకొండ, మే10 (నినాదం):** అమ్మ ఆశీస్సులు బిడ్డల వెంటే ఉంటాయనీ అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ వాక్యాన్నించారు. హన్మకొండ బాలసముద్రంలోని శ్రీ చక్ర ఆసుపత్రిలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ మదర్స్- డే దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిడ్డల ఎదుగుదలకు అమ్మ ప్రేమ నిరంతరం పరితపిస్తుందన్నారు. అమ్మ కష్టాలు త్యాగాలు బిడ్డల వెంటే ఉంటాయని అందుకే అమ్మను నడిచే దేవతగా కొలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో అమ్మలను అనాధలుగా మార్చే విష సంస్కృతి పెరిగిపోతుందని ఇలాంటి సంస్కృతిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. డాక్టర్ చిలకమారి గోపి నాథ్ మాట్లాడుతూ రక్తదానం వల్ల మరొకరి ప్రాణాలు నిలబెట్ట వచ్చునని రక్తదాతలకు ఇమ్యూనిటీ పవర్ పెరిగి మరింత ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందన్నారు. రక్తదాతలకు పండ్లు, బిస్కెట్లతో పాటు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని బహిరంగ సభకు భారీగా తరలిన కార్యకర్తలు



**అమరచింత, మే 10, (నినాదం):** హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని నాయ కులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఆదివారం అమర చింత పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును పార్టీ అధ్యక్షురాలు మంగ లావణ్య జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని అమరచింత మస్తీపురం పామిరెడ్డిపల్లి ఈర్లదిన్నె నందిమల్ల మిట్టనందిమల్ల నాగల కడుమూరు గ్రామాల నుండి కార్యకర్తలు నాయకులు భారీగా వివిధ వాహనాలు తరలి వెళ్లారు. తరలిన వారిలో బిజెపి మండల ఉపాధ్యక్షులు భీమ్సేన్ కుమార్ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు కౌన్సిలర్ ఎం రాజు, పట్టణ కౌన్సిలర్లు విష్ణువర్ధన్ ఉషన్న పట్టణ మాజీ అధ్యక్షులు క్యామ భాస్కర్ పట్టణ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఒగ్గు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడికి రైతులు భారీగా తరలిరండి : సిపిఎం



**అమరచింత, మే 10, (నినాదం):** వరి కొనుగోళ్ళో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని నేడు కలెక్టరేట్ ల వద్ద జరుగు ధర్నా కు రైతులు తరలి రావాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు అజయ్, జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటేష్ కోరారు. ఆదివారం అమరచింత మండలకేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలాల్లో కనీసవసతులు ఏర్పాటుచేయాలనీ డిమాండ్ చేశారు ఒక క్వింటా వడ్లకు 5 కెజిలు తరుగు తీయటం సరికాదని విమర్శించారు. కేంద్రాల్లో మంచినీటి వసతి ఏర్పాటు చేయడం తో పాటు సిబ్బంది రెగ్యులర్ గా ఉండాలని కోరారు. గన్ని బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపించారు. అదేవిదంగా లారీల కొరత సైతం ఉందని ప్రభుత్వఅధికారుల అలసత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలల్లో వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రైతులు అధికారుల కాళ్ళు మొక్కే పరిస్థితి వరకు వచ్చిందంటే రైతుల పట్ల ప్రభుత్వతీరుకు నిదర్శనమన్నారు . మొక్కజొన్న కొనుగోలు రాష్ట్రం లొ సరిగ్గా చేపట్టక పోవడం తోనూతీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చెశారు. రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం రైతు సంబరాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నిశీచారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యల సాధన కొరకు నేడు జరిగే కలెక్టరేట్ ధర్నా కు రైతులు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో

## వీహెచ్ ఆమరణ నిరాహారదీక్ష దీక్షకు మద్దతుగా నిలిచిన బీసీ బలగం

**తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్**




**మిర్యాలగూడ మే 10 (నినాదం) :** వి,హెచ్, ఆమరణ నిరాహారదీక్ష కు మద్దతుగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు,మాజీ రాజ్యసభ సభ్యులు, వి.హనుమంతారావు దేశ వ్యాప్తంగా జరిగే జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని బీజేపీ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి ఒషె, ర్, కలామ్ పెట్టి, ఓబీసీ కలామ్ పెట్టకపోవడాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఓబీసీలపట్ల వ్యవరించే తీరుకు నిరసనగా ఆమరణ నిరాహారదీక్ష కు మద్దతు తెలిపారు పోగుల సైదులు గౌడ్ మాట్లాడుతూఒక బీసీ వ్యక్తి అయిన నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తరువాత దేశంలో బీసీ పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది అని పేర్కొన్నారు, నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీల వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంది అని విమర్శించారు, తమిళనాడు తరహాలో బీసీలు తెలుగు రాష్ట్రాల లో రాజకీయాలు చెయ్యాలని, రాజ్యాధికారంలోకి రావాలి అని పిలుపు నిచ్చారు, వీహెచ్ దీక్షకు మద్దతు తెలుపుతూ బీజేపీ పార్టీ, బీజేపీ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలను తూర్పురాబట్టారు, స్వాతంత్ర్య భారత దేశంలో 79 సం: బీసీలు అన్యాయానికి గురైయ్యారని వాపోయ్యారు, దేశవ్యాప్తంగా జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పడం దారుణమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణంరాజు రాష్ట్ర కార్యదర్శి కర్ణాటక శివరామకృష్ణ, కల్లా నరసింహా గౌడ్ జిల్లా కుశలవ కొత్త లింగ స్వామి యాదవ్ సతీష్ కుమార్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సంబురంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం





**దాహార్తిని తీర్చేది చలివేంద్రం**

**ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్**

**డోర్నకల్ /మరిపెడ మే 10(నినాదం):** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ అన్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రి తండ గ్రామపంచాయతీ పరిధిలోని ధరవత్ తండలో సర్పంచ్ భూక్యా జానకి రాములు నాయక్ ఆధ్వర్యంలో ధరవత్ సరిత లాలు నాయక్ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభోత్సవం చేశారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు విప్‌కు శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పండగ వాతావరణం లో కుటుంబ సభ్యులు, బంధువులు,స్థానికుల సమక్షంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామ సర్పంచులు తమ వంతు కృషిని చేస్తున్నారన్నారు.మిగతా లబ్ధిదారులు కూడా త్వరితగతిన ఇళ్లను పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకోవాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్ళను అందజేస్తానన్నారు. ఇళ్లను అందించడం నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు.ఆ కార్యక్రమం అనంతరం ఎండలు మెండుగా ఉన్నాయి కావున మూలమర్రి తండ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బాటసారులకు దాహార్తిని తీర్చినవారవుతారన్నారు. గిరిపురం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు సురేష్ గృహప్రవేశం రిబ్బన్ కట్ చేసి విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటికొమ్మ యుగంధర్ రెడ్డి,మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి,కాంగ్రెస్ నాయకులు తేజవత్ నెహ్రూ,వెంకన్న నాయక్,తేజవత్ భరత్ నాయక్,గంధసిరి అంబరీష,కొంపెల్లి సురేందర్ రెడ్డి,నల్లు శ్రీకాంత్ రెడ్డి,అఫ్జాల్, ఐలమల్లు,శ్రీపాల్ రెడ్డి, రాంలాల్ నాయక్,కాలం రవీందర్ రెడ్డి,మెంచు అశోక్,కుడితి నరసింహారెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ తండా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళను అందజేస్తాం**

**• ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్**

**డోర్నకల్ /మరిపెడ మే 10(నినాదం):** గిరిపురం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు భాషిపంగు వెంకటమ్మ వెంకటయ్య గృహప్రవేశం రిబ్బన్ కట్ చేసి విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందజేయడం జరుగుతుందన్నారు. నిరంతరంగా కొనసాగే పథకం కావున ఎవరు అధైర్య పడవద్దని అందరికీ ఇళ్లను అందజేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడపగడపకి చేరుస్తామన్నారు బంధుమిత్రులు, గ్రామస్తులు ఇల్లు లేని వారి నిరుపేదలకు గుర్తించి ఇళ్లను కేటాయించడం సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాధవత్ నీలా సైదులు, గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లపు కొండయ్య, భాషిపంగు సురేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# కొమురం భీమ్ కప్ విజేత శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ టీం

**ములుగు ప్రతినిధి మే 10 నినాదం:** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలోని మామిడిగూడెంలో "కొమరం భీమ్ యూత్ "ఆధ్వర్యంలో మంగపేట మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించగా మామిడిగూడెం క్రీడా ప్రాంగణం వేదిక కాగా మండలంలో ఉన్న పలు గ్రామాల క్రీడాకారులు పాల్గొని వారం రోజులు సుదీర్ఘంగా టోర్నీలో పాల్గొన్నారు. టోర్నీలో వరుస విజయాలతో ముందంజలో ఉన్న మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి టీం ఫైనల్లో కోమటిపల్లి టీం తో ఉత్కంఠ భరితంగా సాగి, హోరాహోరీ పోరులో మ్యాచ్ ని గెలిచి ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య రామ్ ఆదేశాల మేరకు మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపల్లి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ యువత మద్యం కు బానిస అవుతున్నారని, యువత ఎప్పుడూ చెడు మార్గంలో నడవద్దని మంచి మార్గంలో నడవాలిఅన్నారు. ఎక్కువగా క్రీడల్లో వాళ్ళ పాత్రను పోషించాలి క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి చాలా



మంచిది అని అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ కుంజ సూర్య దృష్టి కి కొమురం భీమ్ యూత్ మేము టోర్నమెంట్ పెట్టుకుంటున్నాం అన్న మీ వంతు సహాయం మాకు కావాలి అని సంప్రదించగా నేనున్నా అంటూ సూర్య సహాయం చేస్తారు అని చెప్పారు. అనంతరం రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ కుంజ సూర్య మొదటి బహుమతిగా (10,000) పదివేల నగదు, షీల్డ్ మల్లూరు ,రెండవ బహుమతి కోమటిపల్లికి 6000 రూపాయలు, షీల్డ్ మూడవ బహుమతి తిమ్మంపేట 4000 రూపాయలు, షీల్డ్ కు బహుమతులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ మూరుకుట్ల నరేందర్, మంగపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మద్దెల ప్రవీణ్, యూత్ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కబ్బాక లక్ష్మన్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బాసారికానీ నాగార్జున,మండల యూత్ కాంగ్రెస్ నాయకులు నూతలకంటి రాజు, మండల యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జ్ భూక్యా కుమార్ మండల ఎన్ ఎస్ యు ఐ మెంబర్ కంగాల నాగచైతన్య, గ్రామ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ క్రమంలో టోర్నీకి సహకరించిన కుంజ సూర్య కి, మరియు శ్రీ సమ్మక్క సారక్క గిరిజన సొసైటీ కి, మారబోయిన గోవర్ధన్ ఎక్స్ ఎంపీటీసీ కి మేనేజ్మెంట్ కొమరం భీమ్ యూత్ వారు కృతజ్ఞతలు తెలిపారు.

# బండి సాయి భగీరథ్‌పై కఠినచర్యలు తీసుకోవాలి





**ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి**

**ప్లకార్డ్స్ చేత పట్టుకుని నిరసన, దిష్టిబొమ్మ దహనం**

**హన్మకొండ, మే10 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త ధర్నా, నిరసన కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ ఆధ్వర్యంలో హనుమకొండ కాంగ్రెస్ భవన్ కూడలి వద్ద ధర్నా, ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని మాట్లాడుతూ బండి సంజయ్ తనయుడు బండి సాయి భగీరథ్ ను అరెస్ట్ చేయాలి, కేంద్ర మంత్రివర్గం నుండి బండి సంజయ్ ను వెంటనే భర్తరఫ్ చేయాలాంటూ ప్లకార్డ్స్ చేత పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి సాయి భగీరథ్ మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. దేశవ్యాప్తంగా 'బేటీ బచావో -- బేటీ పడావో' అంటూ ప్రచారం చేసే బీజేపీ నాయకులు, ఇప్పుడు ఈ ఘటనపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కొనసాగితే బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే అవకాశం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామనే గర్వంతో విర్రవీగుతూ చట్టాన్ని చుట్టంలా మార్చుకోవాలని చూస్తున్నారనీ ఆమె విమర్శించారు.బిజెపి పాలిత రాష్ట్రాల్లో బీ జే పీ కి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని ఆమె ఆరోపించారు. ఈ ఆరోపణలపై రాజకీయ రక్షణ కింద ఆయా నేతలకు బీ జే పీ రక్షణ కల్పిస్తుందన్నారు. కేంద్ర మంత్రి కుమారుడిపై చట్టపరమైన చర్యలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయనీ ఆమె ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం తమ ఎంపి లను కాపాడుకునే ప్రయత్నం చేస్తోందనీ ఆమె విమర్శించారు. సాధారణ పౌరులపై పోక్సో కేసు నమోదైతే వెంటనే అరెస్టులు చేస్తారు, కానీ కేంద్ర మంత్రి కుమారుడు కాబట్టి పోలీసుల విచారణ నెమ్మదిగా సాగుతోందనీ పేర్కొన్నారు.చట్టం ఎవరికీ చుట్టం కాకూడదు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసే పరిస్థితి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలనీ ఆమె అన్నారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేసి బాధితురాలికి న్యాయం చేకూరాలని డిమాండ్ చేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**వైద్య శిబిరానికి బారులు తీరిన జనం**



**హుజూర్‌నగర్ (మఠంపల్లి) మే 10 (నినాదం):** మఠంపల్లి మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ ఏసు మల్ల వీరలక్ష్మి పాపయ్య, ఉప సర్పంచ్ కొత్తపల్లి నాగయ్య పంచాయతీ కార్యవర్గ సభ్యులు మరియు శుభోదయం యూత్ అధ్యక్షులు గాదె జయ భరత్ రెడ్డి మరియు గ్రామీణ వైద్యులు పివిబి చారి ఆధ్వర్యంలో ఖమ్మం ఎండోకేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరమును ఆదివారం నిర్వహించారు. ఇట్టి ఉచిత మెగా వైద్య శిబిరంలో చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఫయాజ్ , న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి, జనరల్ ఫిజీషియన్ ఎండి డాక్టర్ జియావుద్దీన్, ఆర్థోపెడిక్ డాక్టర్ రాజేష్ లు సుమారుగా 420 మందినీ పరీక్షించి 30 వేల నుండి 50 వేల వరకు ఖరీదైన మందులను రోగులకు అందజేశారు. వైద్య శిబిరం ప్రారంభ అనంతరం ముందుగా ఉచిత శిబిరానికి విచ్చేసిన డాక్టర్లను గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు లూర్దుమరెడ్డి, అంటోనీ రెడ్డి, మహేష్ గౌడ్ హనుమంత్ గౌడ్ రామంజిగౌడ్, దిలీప్ రెడ్డి నాగరాజు, కటికల సునీత , చింతల గురవయ్య, మైనార్టీ నాయకులు ఎస్కే జానీ పాషా మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



**మిర్యాలగూడ మే 10 (నినాదం) :** లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 21 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల 25 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.


# స్పీడ్ బ్రేకర్లు.. జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలి

**• సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్**



**మిర్యాలగూడ, మే 10(నినాదం):** మిర్యాలగూడ పట్టణం బైపాస్ రోడ్డుపై రాంచంద్రగూడ, నందిపాడు, చిల్లాపురం, చింతపల్లి ఈదులగూడ జంక్షన్ వద్ద క్రాసింగ్ లో ఉన్న స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ మార్కింగ్ లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని సీపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి. మల్లేష్ ఆరోపించారు. ఆదివారం బై పాస్ రోడ్డు నందిపాడు చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్ ను సిపిఎం బృందం పరిశీలనలో అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్నాయని విషయమే మరిచిపోయి, అవి రోడ్లలోనే కలిసిపోయి ఉండడం, వాహనాలు వేగంగా పోవడం వలన ప్రమాదాలు జరిగి అనేక మంది ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారని మల్లేష్ తెలిపారు. నిరంతరం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఎటువంటి హెచ్చరికలను సూచించే బోర్డులు లేకపోవడం వలన ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారే తప్ప పరిష్కార మార్గం చూపట్లేదని ఆయన అన్నారు. బైపాస్ జంక్షన్ల వద్ద వైన్స్ షాపులకు అనుమతి ఇవ్వడం కూడా ప్రమాదాలకు మరొక కారణమని వారు చెప్పారు. తక్షణమే అటువంటి వైన్స్ లను రద్దుచేసి వేరే చోట తరలించాలని వారు అధికారులను కోరారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డు మీద ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని శంకుస్థాపన జరిగి సంవత్సరాలు దాటుతున్న అవి ఒట్టి మాటలుగా, నీటి మీద రాతలుగా మిగిలిపోయాయని అధికారులు కానీ ప్రజాప్రతి నిధులు కానీ వాటిపైన దృష్టి లేకపోవడం వలన నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మందికి యాక్సిడెంట్లు గురై కాళ్లు చేతులు పోగొట్టుకొని ఇప్పటికి వికలాంగులుగా మారి జీవితం నరకంగా మారి ఇబ్బంది పడుతున్న సమస్య పట్ల అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నదని తక్షణమే చర్యలు తీసుకోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష బృందాలను కలుపుకొని భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రజల పక్షాన నిలబడి పోట్లాడుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, సిపిఎం టూ టౌన్ కార్యదర్శి భావండ్లపాడు, నాయకులు గోవిందరెడ్డి, రామారావు, రవి పాల్గొన్నారు.

# కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత జువ్వాడి



**దివంగత రత్నాకర్‌రావు 6వ వర్ధంతి వేడుకల్లో**

**తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, మే10 (నినాదం):** కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిని మాజీ దేవాలయ శాఖ మంత్రి దివంగత జువ్వాడి రత్నాకర్ రావు చేశారని ఈ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఆయనేనని తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల ఎదుట దివంగత జువ్వాడి రత్నాకర్ రావు 6వ వర్ధంతి వేడుకలను కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమశీలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావులతో పాటు కోరుట్ల, ధర్మపురి, నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలతో కలిసి జువ్వాడి రత్నాకర్ రావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు అని కొనియాడారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి తప్ప గత పదేళ్లలో 10 బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమే అన్నారు. కోరుట్ల పట్టణాన్ని అటు మెట్ పల్లి వెటర్నరీ కళాశాల వరకు జగిత్యాల పాలిటెక్నిక్ కళాశాల వరకు స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు మంత్రిగా ఉన్న కాలంలో కోరుట్లకు 4500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరుతో మాదాపూర్, అర్బన్ కాలనీ, ఏసుకొని, అల్లమయ్య గుట్ట కాలనీలు ఏర్పాటు చేసిన ఘనత రత్నాకర్ రావుదే అని గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం కోరుట్లకు 80 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మాత్రమే నిర్మించి అవి వారి అనుకూలురకే అప్పగించారే తప్ప అర్హులైన వారికి అందించలేదని అన్నారు. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లోని హామీ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ 500కె గ్యాస్ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాకుండా పేద మధ్య తరగతి ప్రజలు కూడా కడుపునిండా తినాలని సంకల్పంతో రేషన్ దుకాణాల ద్వారా దేశంలో ఎక్కడా లేదు విధంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద మధ్య తరగతి ప్రజల సహకారం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కోరుట్ల నియోజకవర్గానికి ఇప్పటివరకు 3500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ ఇచ్చామని ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బు జమవుతాయని అన్నారు. ప్రొసిడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి వారు ఇంటి నిర్మాణాలు చేపట్టుకోవాలని, అనారోగ్య సమస్య వల్ల ఆస్పత్రిలో చేరి వైద్యం కోసం ఖర్చు చేసిన డబ్బులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అధిక మొత్తంలో అందజేయడం జరుగుతుందన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.7కోట్ల పైచిలుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు అందించామన్నారు. స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు ఆశయ సాధన కోసం తనయులుగా (జువ్వాడి బ్రదర్స్) అనునిత్యం ప్రజలకు అందుబాటులోఉండి సేవ చేసే అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. అనంతరం కోరుట్ల మున్సిపల్ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లతో కలిసి కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల నియోజక వర్గంలోని మండలాల, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## మండలంలో కాంగ్రెస్ రాష్ట్ర నేత పీఎస్ఆర్ పర్యటన

**వెల్గటూర్, మే10 (నినాదం):** నియోజకవర్గంలో పలు శుభకార్యాలు, పరామర్శ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామంలో ఇటీవల జరిగిన వివాహ వేడుకకు హాజరు కాలేకపోవడంతో నవ దంపతులు కోల అశ్విని-సాయిని వారి నివాసంలో కలిసి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన శుభకార్యాలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కిషన్‌రావుపేట గ్రామంలో ఓ దినపత్రిక పాత్రికేయులు పులి లక్ష్మణ్ తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనవెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు,అభిమానులు ఉన్నారు.



నవదంపతులను ఆశీర్వదిస్తున్న శ్రీనివాసరావు

## కనిపించే దేవతకు.. పాదాభివందనం

**400 మంది అమ్మలకు వారి పిల్లల పాదపూజ**

**అమ్మ అన్న పదం అద్భుతం**

**అమ్మకి అద్భుతం మన జీవితం : ఉప్పల వెంకటేష్**

**విజయవంతమైన అమ్మ పాదాపూజా, ఆశీర్వచనము**

**పాల్గొన్న 400మంది మాతృమూర్తులు**

**ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మ పాదాపూజా**





**ఆమనగల్లు, మే10 (నినాదం):** సృష్టికి మూలం , కనిపించే ప్రత్యక్ష దైవం అమ్మ అని , అమ్మ అనే రెండక్షరాల మీద మన మనుగడ సాగుతుందని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా అమ్మ పాదాపూజా కార్యక్రమం నిర్వహించారు.. వారి పిల్లలతో 'అమ్మ పాద పూజ' నిర్వహింపజేశారు. ఆ ప్రాంగణమంతా మాతృదేవోభవ నినాదాలతో మారుమోగింది. ఈ కార్యక్రమాన్ని అమ్మ పాద పూజ, ఆశీర్వచనం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఉప్పల వెంకటేష్ మంజుల దంపతులతో కలిసి ప్రారంభించారు. పాద పూజ కార్యక్రమంలో సుమారు 1000 మంది మహిళ మూర్తులకు వారి పిల్లలు అంగరంగ వైభవంగా పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించి తల్లుల ఆశీర్వచనం పొందారు. అనంతరం ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ పురిటి నొప్పులతో నవ మాసాలు మోసి తన జన్మను, జీవితాన్ని పణంగాపెట్టి మనకు ప్రాణాన్ని పోసింది అమ్మేనని , మంచి పౌర సమాజ నిర్మాణం కోసం అమ్మ పాద పూజ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో రోజు రోజుకు దిగజారుతున్న ప్రేమాభిమానాలకు ఊపిరి పోసేందుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సంతృప్తి ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని అది మాతృ దినోత్సవం సందర్భంగా నిర్వహించడం తనకు గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజహితం కోరే ప్రతి ఒక్కరు ప్రతి నిత్యం తమ తల్లిదండ్రులను ఆరాధించి సమాజ మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆయన తన తల్లికి పాద పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పాద పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ మూర్తులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందచేశారు. శృతిలయ కల్చలర్ అకాడమీ చిత్తరంజన్ దాస్ ఆధ్వర్యంలో నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో,ఆయా గ్రామల ఎంపిటిసిలు, సర్పంచ్లు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలోమూడు లక్షల 99,593 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం

### కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మే10 (నినాదం):** రబీ ధాన్యం కొనుగోలు లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 954.63 కోట్ల రూపాయల విలువ చేసే 3 లక్షల 99,593 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 6 లక్షల 59 వేల 596 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 3 లక్షల 97,616 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. 644 కోట్ల రూపాయల విలువచేసే 2 లక్షల 69 వేల 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులలో భాగంగా 30 వేల 167 మంది రైతులకు 558.94 కోట్ల రూపాయలను చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు. రబీ ధాన్యం కొనుగోలు పై ప్రతిరోజు క్షేత్రస్థా యిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తున్నామని, అంతేకాక సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తున్నామని, ధాన్యం రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే కొనుగోలు కేంద్రాలలో జాప్యం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు లారీలు, హమాలీ, ధాన్యాన్ని తరలించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించినట్లు వెల్లడించారు.


N NADAM CINEMA

## వైట్ శారీలో హాట్ ట్రీట్ ఇచ్చిన రాశి సింగ్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి రాశి సింగ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా పాపులారిటీ సంపాదించుకుంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు అనేకసార్లు వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా మరోసారి రాశి సింగ్ తన స్టైలిష్ లుక్‌తో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. తెలుపు రంగు పలుచటి శారీలో అందంగా మెరిసిపోయిన ఈ బ్యూటీ, దానికి తగిన బ్లౌజ్‌ను ధరించి ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. అలాగే తన కురులను ముందుకు వదిలేసి, ట్రెండీ ఇయర్ రింగ్స్ ధరించడం ద్వారా మరింత ఆకర్షణీయంగా కనిపించింది.



## 'పెద్ది'పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్.. నా పాత్ర అలా ఉండబోతుంది



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తాను నటించిన పెద్ది గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా తన పాత్ర గురించి మాట్లాడుతూ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ... "నేను రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటించాను. ఈ చిత్రంలో నా పాత్ర చాలా అద్భుతంగా ఉంటుంది. నా పాత్ర ట్రీట్మెంట్‌ను కూడా బుచ్చిబాబు చాలా కొత్తగా డిజైన్ చేశారు. సినిమా విడుదలైన తర్వాత నా పాత్రను చూసి ప్రేక్షకులు ఖచ్చితంగా సర్ప్రైజ్ అవుతారు" అని అన్నారు. అలాగే ఈ సినిమా భారీ విజయాన్ని సాధిస్తుందని, ఇందులో పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్, నిర్మాతలకు మంచి గుర్తింపు తీసుకువస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పటికే జగపతిబాబు పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా అది ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. దీంతో ఆయన పాత్రపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమాతో జగపతిబాబుకు ఎలాంటి గుర్తింపు వస్తుందో చూడాలి. పెద్ది చిత్రాన్ని జూన్ 4న తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు.

## ఆ తేదీన రామ్ పోతినేని నెక్స్ట్ మూవీ అనౌన్స్‌మెంట్



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని నెక్స్ట్ మూవీపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనేక వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఆయన నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం ప్రేక్షకులను అలరించింది. వరుస అపజయాల తర్వాత వచ్చిన ఈ సినిమా రామ్‌కు కొంత ఊరటను ఇచ్చింది. ఈ మూవీ తర్వాత రామ్ తన కోసం ప్రత్యేకంగా ఓ కథను సిద్ధం చేసుకున్నట్లు, దానిని తెరకెక్కించేందుకు సరైన దర్శకుడి కోసం వెతుకుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పలువురు దర్శకుల పేర్లు కూడా సోషల్ మీడియాలో వినిపించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం రామ్ తాను రాసుకున్న కథలో హీరోగా నటించడమే కాకుండా స్వయంగా దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని రామ్ సోదరుడు కృష్ణ చైతన్య నిర్మించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమా అధికారిక అనౌన్స్‌మెంట్ మే 15న వెలువడే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. తానే కథ రాసుకుని, హీరోగా నటిస్తూ దర్శకత్వం కూడా వహించనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## ఆ ఆరు నెలలు నరకం చూశా..

### కియారా ఎమోషనల్ కామెంట్స్

బాలీవుడ్ స్టార్ నటి కియారా అద్వానీ, తల్లి అయిన తర్వాత తన జీవితంలో చోటు చేసుకున్న భావోద్వేగ మార్పుల గురించి మొదటిసారి మనసు విప్పి మాట్లాడారు. 2025 జూలైలో తన కుమార్తె సారాయకు జన్మనిచ్చిన తర్వాత, తను ఎదుర్కొన్న పోస్ట్‌పార్టమ్ (బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే మానసిక స్థితి) దశ గురించి ఒక ఇంటర్వ్యూలో వివరిస్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తన గుర్తింపు పూర్తిగా మారిపోయిందని కియారా తెలిపారు. "మొదటి ఆరు నెలలు నాపై నాకు జాలి చూపించుకోవడం కూడా చాలా కష్టంగా అనిపించేది నరకం చూశా. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించే నేను, మొదటిసారి నా కోసం నేను సమయం కేటాయించుకోవాలని గ్రహించాను. నాలోని భావాలను అర్థం చేసుకోవడానికి, నన్ను నేను ప్రేమించుకోవడానికి ఈ మాతృత్వం ఒక గొప్ప మలుపులా నిలిచింది" అని కియారా ఎమోషనల్ అయ్యారు. తన కష్టకాలంలో భర్త సిద్ధార్థ్ మల్హోత్రా అందించిన మద్దతును కియారా కొనియాడారు. "ఆ రోజుల్లో నేను చాలా సున్నితంగా ఉండేదాన్ని, చిన్న చిన్న విషయాలకే ఏడ్చేసేదాన్ని. సిద్ధార్థ్ తన సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్నా, అర్ధరాత్రి వేళ కూడా మా అమ్మ ఇంటికి వచ్చి నన్ను కలిసేవాడు. డాక్టర్ సలహా మేరకు నన్ను ప్రతిరోజూ రాత్రి పూట బయట డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న ప్రయాణం నాకు స్వచ్ఛమైన గాలిని, మానసిక ప్రశాంతతను ఇచ్చేది" అని ఆమె చెప్పుకొచ్చారు. కాగా.. 2023లో పెళ్లి చేసుకున్న ఈ జంట, గతే డాది పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం కియారా తన తదుపరి చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. కన్నడలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యష్, నయనతార కలిసి ఆమె నటిస్తోంది.

## ఓటీటీలో టాప్ ట్రెండింగ్‌లో 'డెకాయిట్



టాలీవుడ్ నటుడు అడవి శేష్ తాజాగా నటించిన 'డెకాయిట్' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద పర్వాలేదనే స్థాయి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం ఈ మూవీకి ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 'డెకాయిట్' ఇండియాలో ప్రైమ్ వీడియోలో నంబర్ 1 ట్రెండింగ్‌లో కొనసాగుతున్నట్లు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీంతో బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోకపోయినా, ఓటీటీలో మాత్రం ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, షానీల్ డియో దర్శకత్వం వహించారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787